క
వి
త్వం

ఆం...!

డా. సూరం శ్రీనివాసులు

జయభాస్కర ప్రచురణలు

ఆః...!

డా. సూరం శ్రీనివాసులు

జయభాస్కర ప్రచురణలు

Publication No. PST12/12

Aah..!
Written by: Dr. Suram Srinivasulu

ISBN No: 978-93-5469-178-2

First Edition: November 2025

Pages: 164

Copies: 400

Price: ₹150 /-

For Copies: Dr. Suram Srinivasulu
Flat No. 24, 4th Mile Center
Shirdi Nagar, Near Masjid
Navalakh Garden, Nellore – 524002
Cell: 9440242348.

Vittu Babu, Hyderabad - 8555082034.
Palaparti Haveela - 89196 68394
Chunduri Venkateswara Rao - 95736 55840
Vanisri Nainala - 95810 17456

Designed, Printed @

Jaya Bhaskara

S3, 2nd Floor, Sai Kalyan Apartments
31 & 32, Road No.4, RKH colony
Dr. A.S.Rao Nagar, Hyderabad – 500062
Design: Vittubabu, Contact: 8555082034

ఎన్. సిహెచ్. చక్రవర్తి

‘ఆః’

తెలుగులో ఆధునిక వచనకవిత్వానికి ఒక నమూనాగా నిలిచే కవితలు డా. సూరం శ్రీనివాసులు రచించిన ఆః కవితలు. సూక్ష్మంలో మోక్షం చూపినట్టు నిడివిలో చిన్నవైన ఈ ‘ఆః’ కవితల కడుపులో అంతరిక్షమంత భావాలు దాగున్నాయి. మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలో ఆః శీర్షికతో ఒక కవిత ఉంది. ఈ ఆః అనే చర్య ఒక అబ్బురపాటును సూచిస్తున్నా...అనే రీతినిబట్టి సందర్భాన్ని పట్టి ఇంకా కొన్ని అర్థాలను వ్యక్తీకరిస్తుంది..శ్రీశ్రీ గారి ఆః కవితయే డా. సూరం శ్రీనివాసులు గారు ఈ శీర్షిక ఎంచుకోవడానికి ప్రేరణ కావచ్చు అని నా అభిప్రాయం. ఈ కవితలలో మానవజీవితంలోని అనేక వైరుధ్యాలూ, వైవిధ్యాలూ, భావసంఘర్షణలూ, సమాజంలో పాతుకొని ఉన్న అనేక విశ్వాసాలూ, మన చుట్టూ సమాజంలో ఉండే అనేకానేక చిత్ర విచిత్ర ప్రవృత్తులూ.. ఇలా అన్నీ విషయాలుగా ఉంటాయి. ఒక్కో కవిత మన గురించి మనం ఆలోచించుకునేట్టు చేస్తుంది. ఒక్కో కవిత మనని మనం తెలుసుకునేటట్టు చేస్తుంది. ఒక్కో కవిత మనలో ఉన్న మనకుతెలియని మనగురించి తెలియచేస్తుంది. ఒక్కో కవిత ఎవరికి వారికి తమ గురించే అందులో నేరుగా చెప్పారా అన్నట్టు సూటిగా ఉంటుంది.

ఆలోచనామృతం కవిత్వం అన్న నిర్వచనానికి మచ్చులుగా నిలుస్తాయి ఇందులో అనేక కవితలు. ఒకరోజు నేను కొందరు మిత్రులకు ఒక కవిత చదివి వినిపించి, దాని సారాంశం చెప్పుమన్నాను..ఆ కవిత ఇదీ.

అతడు / మధ్యాహ్నం భోజనం చేస్తూ / మధ్యలోనే ఆపవలసివచ్చింది / రసం కలుపుతున్న చేతితోనే / లేచి పోవలసి వచ్చింది

అయితే నేం / అతని పట్టుదల పటిష్ఠం

రాత్రి భోజనాన్ని / రసంతోనే ప్రారంభించి / మజ్జిగతో ముగించి / మహనీయు డైపోయాడు

కొందరు కొన్ని రకాలుగా దీనిని గ్రహించారు. కవి భావన ఏమైనా....అది ఒకటే అయినా ఒకటికంటె ఎక్కువ అయినా....పాఠకులు మాత్రం వివిధంగా అన్వయించుకున్నారు.

మొత్తంమీద అతడి పట్టుదల ఇక్కడ ప్రధానం. అంటే దీక్షాపరతంత్రుడు. ఎందులో?? భోజనం చెయ్యడంలో. ఆటంకం వచ్చినా దానిని కొనసాగించి, పూర్తిచేస్తాడు. దీనిని ఈ నాటి నిరాహార దీక్షలకు అన్వయించుకుంటే మరింత బాగుంటుంది. రెండుపూటలా ఏమీ తీసుకోవడంలేదని.

ఆధునిక భక్తిలో ఆడంబరం పెరిగింది. భక్తి ఒక ప్రదర్శన కాదు. పటాటోపం కారాదు. కానీ ఆత్మానందసంధాయకమైన నిజభక్తిని వదిలేసినవానినే భక్తునిగా ఆధునిక భక్తులు పరిగణిస్తున్నారు. నలుగురితో కలిసి పంచుకుని తినేదే అసలు ప్రసాదం. గుడిలో అన్నప్రసాదం ఎవరికి అందాలి?? విరాళాలు ఇచ్చే దాతలు ఎవరికొరకు ఇస్తున్నారు?? ఎవరు భోంచేస్తున్నారు??

కార్తీకమాసంలో గుడిలోపల / ప్రతిరోజూ అన్నప్రసాదవితరణం / పట్టుబట్టలతో కోటిదీపాలను / ప్రకల్పించే భక్తమహాశయులకు...

గుడిబయట / గోర్కీ కాలంనుండీ / గొంతులెన్ని అరుస్తున్నా / ఆకలిచూపుల వెనుక / అష్టలక్ష్మల ఆర్తిగీతికలు

గుడిలోపలి ప్రసాదాలు అన్నీ పట్టుబట్టలు కట్టుకుని, ఎంతో చెల్లించి, అక్కడ వేదికపై సంకల్పం చేసుకునే అవకాశం ఉన్న పేదవారికే. వారు మహాశయులు. గుడి బయట ఒక ప్రపంచం ఉంది. ఆ ప్రపంచం ఆకలి తీరని ధనికులది. ఈ వ్యంగ్యాన్ని సాధించడం ద్వారా డా. సూరం వారు గుడి వాతావరణంలో స్పష్టంగా కనిపిస్తున్న పేద, ధనిక భేదాలు కళ్ళకు కట్టారు. దేవుని ముందు అందరూ సమానులే అనే మాటలోని డొల్లతనాన్ని బయటపెట్టారు.

"నీ హక్కులు నా ముక్కువరకే / అరఅంగుళం దాటినా / నువ్వు ధర్మం తప్పినట్లే....." / మాటింకా పూర్తికానే లేదు / అంతే అమాంతంగా / అతనిముక్కు అంగుళం మేర కోసేశాడు / ధర్మతత్పరదార్శనికుడు

సూక్తిముక్తావళి వ్రాసుకునేవాళ్ళం మాత్రమే / సూక్తులు చెప్పుకుందాం / కబ్జాదారులకూ చెప్పటమే!!! / వారు చరిత్రపుస్తకాల్లో మహారాజుల్లా / వీ ర పు రు(ఋ)షు లు....

దీనిని గురించి చెప్పాలంటే ఇప్పటి చరిత్ర అంతా చెప్పుకోవాలి. Your right ends where my nose begins అనే సత్యాన్ని ఆవిష్కరించే కథ మనం విన్నాం. ఈ హక్కులు కాపాడవలసిన ధర్మతత్పర దార్శనికులు ఎవరూ?? మంత్రులూ

పాలనావ్యవస్థలో భాగస్వాములు అయినవారూ.. న్యాయవిభాగమూ. ఇవన్నీ సమన్వయంతో పౌరుల, బలహీనుల ముక్కులను కోసి మరీ హక్కులను రక్షిస్తున్నాయి. గట్టిగా మాట్లాడితే మన ముక్కుపై మనకే హక్కు పోతుంది. ఆ ముక్కు అవతలివాడి చేతిలోకి వెళ్లిపోతుంది. మనంరక్తం తుడుచుకుంటూ ఉండగానే దానిపై అవతలివాడి ముద్ర పడిపోతుంది. అందుకే వ్రాసుకునే నీతులన్నీ వ్రాసుకునే వాళ్ళకే. ఒక్కొక్కడూ నరహంతకుడు అని శ్రీశ్రీ అన్నట్టు ప్రతి కబ్జాదారూ ఒక మహారాజు. మహారాజువలె చెలామణీ అయ్యేవారికి కబ్జాచేసే హక్కూ ఉంటుంది. రాజ్యాంగంలో లేని లోపాయికారీ రాజ్యాంగం ఒకటి అమలవుతూ ఉంటుంది. అమలుచేసేవారు చరిత్రలో మహారాజులుగా నిలుస్తారు..రాజ్యం వీర భోజ్యం అని ప్రాచీన రాజ్యాంగం చెప్పలేదా? ఇది ఇప్పుడు మరింత బాగా అమలవుతున్నది. ఈ సంగతులన్నీ సూరం మాస్టారి ఈ కవితలో ధ్వన్యాత్మకంగా ఉన్నాయి.

దేశవ్యాప్తంగా ఆడవాళ్లపై అత్యాచారాలు జరుగుతూనే ఉంటాయి.. ఎన్కౌంటర్‌లో కొందరికి తొందరగా మోక్షం వస్తుంది. కొందరు ఈ భూలోకంలో ఇంకా మిగిలిన స్వర్గసుఖాలు అనుభవిస్తూ ఉంటారు. మనం ప్రత్యక్షంగా చూసే విషయం ఇది.

కత్తులతోనైనా కరచాలనం చేయవచ్చు / కానీ చేసేముందు / తేనె మరకలున్నాయేమో గమనించాలి / లీలామాత్రంగా కనిపించినా / గీతావాక్యంలా భావించి / గీత దాటకుండా ఉండాలి.. / వాటికి పిడిదగ్గరకూడా పదునే

మైపూతలు లేకుంటే / వాదర ధగధగలాడుతున్నా సరే / చేతితో తడమనూ వచ్చు / సాము చేయనూ వచ్చు / ఎందుకంటే / అది ఏం చేసినా ఎదుటపడి చెప్పే చేస్తుంది / దొంగదెబ్బలూ వెన్నుపోట్లూ దానికి నచ్చవు.

పత్రికాభాషలో ఉన్న ప్రయోగం మృగాడు. దానిని డా. సూరం మాస్టారు కూడా తీసుకున్నారు. ఆ మృగాడు కామపురుషార్థంలో హద్దులు అతిక్రమించాడుట. వాడిని ఎన్కౌంటర్ కరుణించింది. మరొకడు అర్థ పురుషార్థంలో ఆంక్షలు అతిక్రమించి ఆ డబ్బు ఖర్చుపెట్టి జనం ఆమోదంతో ఏలిక అయి కూర్చున్నాడు..అర్థ పురుషార్థం సాధిస్తే ఈ సమాజంలో పదవులు ఏలవచ్చు అని మన స్వామ్యంలోని మర్మాన్ని చెప్పడం..

బడ్జెట్ అనే పేరుతో ఉండే ఆధునిక భారతీయ వార్షిక గణాంకాలను వాటిలోని లొసుగులను ఒక్క కవితలో చదువరుల ముందుంచారు కవి. అన్ని వర్గాల వారిని ప్రత్యక్షంగా అందులో చూపకపోయినా... ఉద్యోగవర్గానికే పరిమితం చేసినా... ఎన్నెన్నో చెప్పుకోవచ్చు.

మూడంకెలు / నాలుగంకెలు / అయిదంకెలు / ఆరంకెలు / ఏడంకెలు / ఎనిమిదంకెలు / తొమ్మిదంకెలు

వేతనాలు పెరుగుతూనే ఉన్నాయ్ / వెతలు వాటి వెంటబడుతూనే ఉన్నాయ్ / ఆనందాలు అవధులు మించుతూనే ఉన్నాయ్ / అసంతృప్తులు అడ్డగోడలై నిలుస్తూనే ఉన్నాయ్ / బంధాలు ఎక్కడికక్కడ ముడిపడుతూనే ఉన్నాయ్ / ప్రజాతంతువులు ప్రమాదాల్లో పడుతూనే ఉన్నాయ్ / ఎక్కడో పొరపాటు జరిగింది...భూమి గుండ్రంగా లేదేమో!!!

వేతనాలు... వెతలూ సమాంతరంగా పెరుగుతూనే ఉన్నాయి. ఆనందాలూ ఆగలేదు.. అసంతృప్తులూ చల్లారలేదు. శాస్త్రీయంగా ఆలోచిస్తే ఒకటి పెరిగితే ఒకటి తగ్గాలిగా! అలాలేదు.

అంటే ఎక్కడో పొరపాటు జరిగింది. వెళ్లాల్సిన దారిలో మనం వెళ్ళడం లేదని సుస్పష్టం. కోరికలు విపరీతం కావడం, లేదా ప్రభుత్వాలు ధరవరలను నియంత్రించ లేకపోవడం....ఇలా కొన్ని కారణాలు ఉన్నాయి. కాగితాలపై ఉన్న బడ్జెట్ పెరుగుదల ప్రభావాలు సామాన్యుల జీవితాలలో కనబడడం లేదు..రాష్ట్రాల బడ్జెట్లు ఎన్నోరెట్లు పెరుగుతున్నాయి. జీతాలూ పెరుగుతున్నాయి. అసంతృప్తులు కూడా పెరుగుతున్నాయి. ఎక్కడుంది లోపం?? భూమి గుండ్రంగా ఉంటే అన్నీ సవ్యంగా జరగాలి. సవ్యంగా జరగడం లేదంటే....మరి భూమి బల్లపరుపుగా ఉందేమో!! ఒక ఆర్థిక శాస్త్రవేత్త కవిత్వం వ్రాసినట్టు ఉంటుంది ఈ కవిత.

గతంలో నేను ఒక నానీ వ్రాసాను.

వాళ్లిద్దరూ
కౌగిలించుకున్నారు
కత్తులు
కడుపుల్లో పెట్టుకుని.. అని.

అది గుర్తుకు వచ్చింది... డా. సూరం వారి ఈ కవిత చూసాకా..

కత్తులతోనైనా కరచాలనం చెయ్యవచ్చు / కానీ చేసేముందు / తేనె మరకలున్నాయేమో గమనించాలి.

ఎంత బాగా చెప్పారో!

ఇప్పటికీ సమాజంలో ఇల్లాలు పడుతున్న అవస్థలు ఏమిటో ఈ రెండు ముక్కల్లో చెప్పారు.

మగాడు కోరుకునే వరం ఒక్కటే... / ఎద్దులాంటి భార్య.

అదే కవితలో ఆడది కోరుకునే వరాలకూ, మగాడు కోరుకునే వరాలకూ ఎంత తేడా ఉందో తెలుస్తున్నది. ఇటీవల జరుగుతున్న అనేక సంఘటనలు చూస్తుంటే ఆడవాళ్లు కూడా తమ తమ కోరికల్లో మార్పులు చేసుకుంటున్నారేమో... మగాళ్లతో సమాన హక్కులు సాధిస్తున్నారు ఏమో అనిపిస్తుంది.

అదే కవితకింద ఒక వాక్యం కనబడుతుంది. టర్కీ టవళ్ళు పిండాలిగా అని. ఇది ఒక వ్యంగ్యం. ఏమిటా వ్యంగ్యం?? తమ బట్టలు ఉతకడానికే భార్యలు ఉంటారనీ అదే స్త్రీల పాతివ్రత్యానికి ఒక గీటురాయి అనీ ఇప్పటికీ కొందరు మగాళ్లు ప్రవాచకుల సాక్షిగా నమ్ముతున్నారు..అదీ వ్యంగ్యం.

నిన్నటిదాకా నిశానీదారులని / వాళ్లనూ వీళ్ళనూ చూసి నవ్వుకున్నామా? / ఇప్పుడు చూడండి కాలచక్రపు తిరుగుడు / అక్షరాస్యులంతా కూడా అంగుష్ఠ మాత్ర ప్రమాణులై / వందేళ్ళ బతుకునూ అందులోనే దాచుకుంటున్నారు.

అంటారు ఒక కవితలో. ఇప్పుడు ఎంతటి విద్యావంతుడైనా వేలిముద్ర గుర్తు కోడ్ తోనే ఎన్నెన్నో పనులు చేస్తున్నాడు..ఆ ముద్రలోనే ఆర్థిక లావాదేవీలన్నీ నిక్షిప్తం చేసుకుంటున్నాడు. ఈ నిశానీతనం ఒకప్పుడు నిరక్షరాస్యతకూ, అవిద్యకూ గుర్తు.. ఇప్పుడు చదువుకున్న ప్రతివ్యక్తి ఒక నిరక్షరాస్యుడే....(అ)జ్ఞాన పరంగా.

శిశిరం మంచుపొర కప్పినంత మాత్రాన / వసంతం కిసలసన్యాసం పుచ్చుకోదు.....

ఈ ఎత్తుగడ చదవడం తోటే ఏదో గంభీర విషయంలోకి వెళ్ళబోతున్నాం అని ఊహిస్తాం. మన ఊహ నిజమే అవుతుంది.

మరి మనమేమిటి? / గోరంత కష్టం వస్తే కొండంతగా కుమిలిపోతలా? / మరకలు పడ్డాయని మనస్సునే చంపుకోవడాలా? / అడుగు తడబడితే కాళ్ళనే నరుక్కోవడాలా?

అంటూ తాత్వికులై మన బ్రతుకుకు కూడా ఒక లయ ఉందనీ, దాన్ని అందుకొమ్మనీ సందేశిస్తారు. ఈ చివరికొచ్చేసరికి మనం కవితో ఏకీభవించి తాదాత్మ్యం చెందుతాం.

సామూహిక సంఘ జీవన స్వరూపం మారిపోయింది. అందువల్ల మనవి అనుకునే మన పండుగలు జరుపుకునే విధానమూ మారిపోయింది. ఈ నాటి సంఘజీవనం వేరు. పండుగల్లో హడావిడి వేరు. కలిసి చేసుకోవడం, కలిసి తినడం, పంచిపెట్టడం ఇవన్నీ ఇప్పుడు కృత్రిమ అద్దాల్లో బిగింపబడ్డాయి. మనది అనుకునే మన పూర్వపు సంస్కృతిలో.... ఊళ్ళో ప్రేమలూ, అభిమానాలూ, అనుబంధాలూ కలబోసుకునేవాళ్ళు. అప్పుడు గిన్నెల్లో, డబ్బాల్లో మూతలతో ఇళ్లకు వెళ్ళేవి. అదే అచ్చపండుగ.

ఇప్పుడూ వెడుతున్నాయి... కానీ అలంకరించిన ప్యాకెట్లలో... స్విగ్గీ ఆర్డర్లతో... లోపలి పదార్థం ఒకటే... కానీ అందులో రంగరించిన ప్రేమలూ, అనుబంధాలూ లేవు. అవే అప్పటి రుచులను పెంచేవి. రుచులకు జీవం పోసేవి. మన కళ్ళముందే మారిపోయిన ఈ పరిస్థితులను కవి ఇలా చెప్తారు.

అరిసెలు అన్నిచోట్లా దొరుకుతాయి / రుచి రసవంతం కావాలంటే పదిమందీ కలిస్తేనే / మధ్యలో పొయ్యి పెట్టి చుట్టూ నలుగురూ చేరితేనే

ఇక్కడివరకూ చదివేసరికి కవి ఏం చెప్పబోతున్నారో మన ఊహకు వస్తుంది. కాకుంటే చెప్పబోయేదానికి సంవిధానం ఎలాగా అనేదే!

అర్ధరాత్రిదాకా అందరిళ్లలో అమృతమైతేనే

అరిసెలు, పిండివంటలు, ఊరగాయలు, అప్పడాలు, వడియాలు ఇవన్నీ మన సమిష్టిజీవనాన్ని పటిష్టం చేసాయి ఒకప్పుడు. రాత్రో అర్ధరాత్రో వేళ ఏదైనా అలుపురానితనం.

ఒకే అంగడి సరుకై ఉసూరుమంటూ బ్రతుకై / ఇప్పుడు వీథికంతా ఒకే రుచి... బ్రాండెడ్ అరిసెలతో.

ఎంతగా హత్తుకునేట్టుగా చెప్పారో!! ఈ ముగింపుతోనే అందరం కలిసి పండుగ చేసుకున్నంత సంబరం.

సమిష్టి జీవనం కాస్తా బ్రాండెడ్ కంపెనీలమయం అయిపోడాన్ని చూస్తూ కవి పడే ఆవేదన అది. అప్పుడు అనుబంధాల పంపకం జరిగేది. ఇప్పుడు డబ్బుల పంపిణీలు మాత్రమే జరుగుతున్నాయి.

కవిగా డా. సూరం శ్రీనివాసులు గారు ఒక భావుకులుగా, ఒక తాత్వికులుగా, ఒక చమత్కారిగా, ఒక బోద్ధగా, ఒక సామాజికులుగా బహు రూపాలలో కనిపిస్తారు. వాస్తవం, వ్యంగ్యం కలబోతగా ఉంటూ, భేషజం లేనితనం వారి కవిత్వ వ్యక్తిత్వం. క్లప్తత, గుప్తత వారి కవితాలక్షణాలు. విద్వత్కవిగా వారు తెలుగూ సంస్కృతాల్లో అద్భుత కవిత్వాన్ని వెలయిస్తారు. అటు సంప్రదాయ పద్యంకవిత్వంలోనూ ఇటు ఆధునిక వచనకవిత్వంలోనూ సవ్యసాచి. విమర్శకాగ్రేసరులు. శతావధాని. సంస్కృతాంధ్ర వ్యాకరణ శాస్త్రాలలో అందెవేసిన చెయ్యి. గొప్ప వక్త. రసాలంకారాది శాస్త్రాలలో దిట్ట. ఇంతింతగా ఇన్నింట ప్రజ్ఞ సాధించినవారు.... ఈ కాలంలో వీరొక్కరే అని అనుకుంటే...అది పచ్చినిజం. వీరి మార్గదర్శనంలో ఎన్నో పీహెచ్‌డీ పరిశోధనలు, ఎన్నో కావ్య పరిష్కరణలు జరిగాయి. ఇంతటి వీరి ప్రజ్ఞా పాటవాలకు 'ఆః' అనిపిస్తుంది.

డా. సూరంశ్రీనివాసులు గారు మరిన్ని కావ్యాలు వెలయించాలని కోరు కుంటున్నాను.. ఈ 'ఆః' వచన కవితలకు ముందుమాట వ్రాయడంలో ఎంతవరకు కృతకృత్యుణ్ణి అయ్యానో తెలియదు. ఎందుకంటే ఏ కవితా వదలబుద్ధి కావడంలేదు. "ప్రతిపద్యచమత్కృతి" అని చేమకూర కవి ప్రకటించుకున్నట్టు ఇందులోని ప్రతి కవితలో నేను పైన చెప్పినట్టు ఏదో ఒక విశేషం ఉంది. అది ఆకర్షిస్తూ ఆకట్టుకుంటూ ఉంది. కవ్విస్తుంది. ఊరిస్తుంది. కానీ ముందుమాటకు ఒక పరిమితి ఉంటుంది కనుక...ఆ హద్దులో ముగించవలసి వస్తున్నది.

వాట్సాప్ సాహిత్య బృందాల సాహిత్య పిపాసులను రోజుకొకటిగా అలరించిన ఈ కవితలు ఇప్పుడు పుస్తకంగా రావడం... వనంలోని అందమైన పూలన్నీ ఒకేచోట పేర్చడం వంటిది.ఇంక ప్రవేశించి, ఆస్వాదించడం మనవంతు.

ఈ కవితలు చదివాక మనం అందరం ఆః అనుకుంటాం. ఆహా అనీ అనుకుంటాం.

:స్వస్తి:

తెలుగు భాషాసేవకుడు

హైదరాబాద్ నివాసం — ఎన్. సీహెచ్. చక్రవర్తి

20-06-2025 — 91822 76862

Adavikolanu Venkat
USA

DISPERSED MEDITATIONS

A NOTE ON DR. SURAM SREENIVASULU'S AAAAH!

It was Plato that said, "poetry is thrice removed from reality." That being the case, anyone commenting on a poem or on someone's poetry is further removed from reality. Hence, I am embarking on this arduous task with humility knowing well that my note may not even scratch the surface of Dr. Suram Sreenivasulu's poetic vision!

The 146 poems in Dr. Suram's "***Aaaah!***" are a kaleidoscope of piercing reflections on human predicament in contemporary society. The first poem sets the stage for an underwhelming portrayal of the modern man who feels proud for completing, with determination, an unfinished meal that was interrupted at lunch time. Some poems lament the dearth of true leaders (6); an overdose of false prophets who pretend to spread *jnaanam* despite treading wrong paths themselves (18); and corrupt political dynasties under the guise of democracy (19). Some proclaim deep rooted political hypocrisy bearing the stamp of democracy (24); and expose cloistered virtue in all occupations echoing the age-old admonishment that cloistered virtue is no virtue at all (26).

The mercenary nature of modern humans is explored where everything is for sale, and nothing is sacred. We sell deadly arms during periods of war, and white roses during peace. When milk is unavailable, we make living by selling water – something Nature gives for free! That is the great marketing skill of the modern man – sell anything and everything (28).

Speaking of Nature, in poem 38, Dr. Suram lays bare our despair at even the minutest of hardships in stark contrast to how relentlessly resourceful and resilient Nature is! Its recuperative power is a lesson for us – the frail humans.

Echoes of the great poet Sri Sri are unmistakable in poem 45, especially the very last sentence! So is poem 51, albeit with a tinge of optimism!

One is reminded of Coleridge's *Ancient Mariner* in poem 53. "Water, water, everywhere, Nor any drop to drink" cries Coleridge's Mariner out of despair. But Dr. Suram presents an optimistic view of the waters of the oceans and their salubrious impact on life on the planet.

Poem 62 raises serious alarm on the disastrous consequences of ignoring the youth's addiction to social media devices. His plea for "no device days" to wean the youth from their addiction before this tsunami engulfs them and the society in its wake should not be ignored. Is it too late already?

Poem 77 is a warning to the Frankensteins of the dire consequences of meddling with Mother Nature. Perhaps he is referring to the COVID virus that caused havoc and took millions of lives in no time. The beginning of the poem reminds one of William Blake's *The Tyger* that explores the destructive aspects of an otherwise benign Nature. Dr. Suram balances this aspect with the benevolent and nurturing aspects of Nature in poem 87; and implores us to learn from Nature! In the same vein, he highlights the never changing aspect of Nature. Nature follows rigid rules without deviating even a bit from its routine. In contrast, human beings, from the moment of their birth till their last breath, cause harm to their surroundings with reckless abandonment. This is the same Sun, Moon, Oceans, and Mountains that existed during the times of Rama and Krishna; but it is the modern Man, in the name of science, who became a threat to Nature. Nature will have its final say, as evidenced during the recent pandemic.

The dire consequence of Artificial Intelligence, if its progress is unchecked or regulated, to make us all the living dead, did not escape Dr. Suram's keen eye (93). Similar frustration of the poet on the misuses of the Internet is showcased in poem 135. The Internet is like a knife. In a surgeon's hands it can save one's life and in a criminal's hand it can take one's life. Do we have the discipline to take the positive

and not fall for the temptations lurking in every click of a mouse in a search tool? These two poems Dr. Suram have echoes of T.S. Eliot's poetry (*The Wasteland,* and *The Love Song of J Albert Prufrock*) at the turn of 20th Century when the world found itself confronting the effects of the Industrial Revolution.

Dr. Suram's definition of poetry (136) spells out the purpose of poetry. It is not a pastime! Nor is it a medley of wild imaginations that leave the reader in a whirl! It also is not a mechanism to make a living by showering poetic praise on unworthy people. It is a celebration of one's own conscience (*antahkaranam*) in association with one's grasp of Nature's intricacies - however limited it is! Poetry is a chariot of Dharma so graciously pulled by Truth and Beauty (Satyam and Sundaram). Such poetry is a fitting tribute to the glories of the Universe (*punyaha-vachanam*)! When I read this poem, my mind went back half-a-century to those carefree days of reading Wordsworth, Keats, and Shelley.

While Dr. Suram' use of aphorism (see the last two sentences of poems 40 and 41) is unmistakable (with one sentence overweighing the rest and becoming the central theme); his use of antithesis, in my uneducated opinion, brings balance to the poems. The first stanza presents one side of the coin and the second stanza a different (often opposite) view, offering the reader a choice.

In conclusion, this note does not claim that it is either definitive or exhaustive. Rather, it is an amateur's attempt to sound scholarly! My sincere thanks to Dr. Suram Sreenivasulu for giving me an opportunity to comment on his poems. If I met his expectations even at a 5% level, I consider myself fortunate.

Adavikolanu Aalochanalu

July 19, 2025

కృతజ్ఞతలు

ఆః శీర్షికతో ప్రకటించిన కవితలను ఆస్వాదించి, ప్రోత్సహించిన వాక్స్థలి పాఠకులకు...

తమ అమూల్యమైన అభిప్రాయాలను అందించిన శ్రీ నల్లాన్ చక్రవర్తుల శ్రీరామచక్రవర్తి గారికీ, శ్రీ అడవికొలను వెంకట్ గారికీ...

అక్షరదోషాలను సవరించటంలో సహకరించిన
శ్రీ కోట రాజశేఖర్ గారికి,
శ్రీ సూరం చంద్రశేఖరం గారికి,
కుమారి సూరం అరుణకు

ముద్రణకు అనుకూలంగా గ్రంథాన్ని తయారు చేసిన చి|| విట్టుబాబుకు...



గ్రంథ ముద్రణకు ఆర్థికంగా సహకరించిన

శ్రీ అడవికొలను వెంకట్ గారికి

హార్దిక కృతజ్ఞతలు

1

అతడు
మధ్యాహ్నం భోజనం చేస్తూ
మధ్యలోనే ఆపవలసివచ్చింది
రసం కలుపుతున్న చేతితోనే
లేచి పోవలసి వచ్చింది

అయితే నేం
అతని పట్టుదల పటిష్ఠం

రాత్రి భోజనాన్ని
రసంతోనే ప్రారంభించి
మజ్జిగతో ముగించి
మహనీయుడైపోయాడు

2

నేను ఎదిగినంత మేరకే
మీరూ ఎదగండి
నాకు అసూయలేదు
నేను చెడినంతమేరకే
మీరూ చెడండి
నాకు అసహనం లేదు
ఆత్మారామా!
ఎవరిహద్దులు వారివైతే
ఎందుకు ఇక ఆరాటం
ఎవరిసుద్దులు వారివైతే
జగమంతా పరిహాసం

3

అప్పుడే జీవితంలో అడుగుపెట్టా
మేధావిననే భ్రాంతిలోనూ పడ్డా
ఎవ రే మాట అన్నా సరే
"అదే జీవితమంటే"
అంటూ ముగించేవాణ్ణి

ఇప్పుడు కొంచెం ఎదిగా
కవిత్వమూ గిలుకుతున్నా
ఎక్క డే భావప్రస్తావన వచ్చినా సరే
"అదే కవిత్వ మంటే"
అంటూ ముక్తాయింపుతో ముగిస్తున్నా

4

కార్తీకమాసంలో గుడిలోపల
ప్రతిరోజూ అన్నప్రసాదవితరణం
పట్టుబట్టలతో కోటిదీపాలను
ప్రకల్పించే భక్తమహాశయులకు...

గుడిబయట
గోర్కి కాలంనుండీ
గొంతులెన్ని అరుస్తున్నా
ఆకలిచూపుల వెనుక
అష్టలక్ష్మల ఆర్తిగీతికలు

5

ప్రేమికుడు అడిగాడు గదా అని
పూలవానలే కురిపించాడు మేఘుడు
ప్రియురాలి విశాలనయనాల్లో
ఆనందపీయూషతరంగాలు

ఇటు తిరిగి చూస్తే

ఎండిపోయిన అన్నదాతకన్నుల్లో
ఇంతకింతకూ విచ్చుకుంటున్న
నైరాశ్యపు నెర్రెల దృక్కులు
పొలంలో దిగాలుపడిన దిష్టిబొమ్మలు

6

ఒకప్పుడు
నడిపించగలవాడు నాయకుడు
ఇప్పుడు
నమ్మించగలవాడే నాయకుడు
రాజకీయమైనా రాజయోగమైనా

కొందరికి తంత్రాలూ
కొందరికి మంత్రాలూ
ఇద్దరూ ఇద్దరే
ఎవరూ ఎవరికీ తీసిపోరు
ఎవడి ఆరాటంలోనే వాడుంటాడు

ఒకడు కాళ్ళు ముడుచుకునే ఉంటాడు
ఎవడూ పట్టిలాగకుండా
ఒకడు కాళ్ళు చాపే ఉంటాడు
పాదనమస్కారాలు ప్రక్కకు పోకుండా

7

నిందితుడిని అప్పగిస్తూ
థర్డ్ డిగ్రీ వాడవద్దని
న్యాయమూర్తి హెచ్చరిక
ముద్రశుద్ధిగా అప్పగిస్తామని
సత్యకామజాబాలుల హామీ

అయినా

పీనల్ కోడ్ అనుమతిస్తుంటే
జడ్జి ఎందుకు నిషేధిస్తాడో!
పీనల్ కోడ్ వ్యతిరేకిస్తుంటే
పోలీసు లెందుకు
పూనకం తెచ్చుకుంటారో!

త్రాసు పట్టుకున్న తనకే ఎరుక

8

"నీ హక్కులు నా ముక్కువరకే
అరఅంగుళం దాటినా
నువ్వు ధర్మం తప్పినట్లే....."
మాటింకా పూర్తికానే లేదు
అంతే అమాంతంగా
అతనిముక్కు అంగుళం మేర కోసేశాడు
ధర్మతత్పరదార్శనికుడు

సూక్తిముక్తావళి వ్రాసుకునేవాళ్ళం మాత్రమే
సూక్తులు చెప్పుకుందాం
కబ్జాదారులకూ చెప్పటమే!!!
వారు చరిత్రపుస్తకాల్లో మహారాజుల్లా
వీ ర పు రు(ఋ)షులు....

9

పిచ్చికవిత రాసినా
పెచ్చుపెరిగిన స్పందనలను చూసి
దిగ్విజయంతో నేనుంటే
అభినందిస్తూ
ఖాళీగ్లాసులతో మీరు

ఎంత గొప్ప కవిత రాసినా
ఎమోజీలు ఎక్కువరాలేదని
దిగాలుగా నేనుంటే
ఓదారుస్తూనే
ఖాళీగ్లాసులతోనే మీరు

10

“ఆడది కోరుకునే వరాలు
రెండే రెండు
చల్లని సంసారం
చక్కని సంతానం”

మగవాడికి కోరికలు తక్కువ
మగాడుకోరుకునే వరం
ఒక్కటే ఒక్కటి
ఎద్దులాంటి భార్య
అదీ దుక్కిటెద్దు కాదు
గానుగెద్దు
(టర్కీ టవళ్ళు పిండాలిగా)

11

"**కా**వడి భుజానికి ఎత్తుకొని ఒకడు
నీళ్ళు మోసుకుపోతున్నాడు
ఆ ప్రక్కన ఒక బుంగ
ఈ ప్రక్కన ఇంకొక బుంగ..
ఎదురుగా ఇంకొకాయన
ఖాళీ బుంగలతో వస్తున్నాడు
ఇద్దరూ నవ్వుతున్నారు"

ఒరేయ్..ఏమిట్రా ఇది

కవిత్వం బాబాయ్
అందరికీ అర్థం కావాలని...

12

ఆటవికుడు వ్రాసిన రామాయణాన్నీ
ఆరణ్యకుడు వ్రాసిన భారతాన్నీ
హాలికుడు వ్రాసిన భాగవతాన్నీ
నాగరీకులం నాణ్యంగా వాడుకుంటున్నాం

చదివి బాగుపడి కాదు
చెప్పి సొమ్ముచేసుకుంటూ

ఈగల తేనెనే కాదు
పురుగుల పట్టునే కాదు
తుమ్మల బంకనే కాదు
తలంటే కుంకుళ్ళనే కాదు
భూచక్రగడ్డలనే కాదు
అడవితల్లిబిడ్డలను కూడా

దేన్నైనా దోచేయగలమని
ధర్మాన్నే దళారిని చేసి ప్రకటిస్తున్నాం

13

ఒకప్పుడు
పొరుగూరి నుండీ
కబురు వచ్చేదాకా
అందరూ క్షేమంగా ఉన్నట్టే

ఇప్పుడు
ఉన్న ఊరైనా సరే
క్షణక్షణం కబురు వచ్చేదాకా
ఏదో జరిగిపోతున్నట్టే

చరవాణి
మాటలను దగ్గర చేసింది
మనుషులతో పాటు
మనసులను దూరం చేసింది
'ధైర్యంతో పాటు'

14

ఒక సుప్రభాతాన
ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్
"దుర్భిణీ దిగ్దర్శనం"లో
సనాతనధర్మానికి దారి చూపమన్నాడు

నావిగేషన్ ప్రారంభమైంది...

'సీతారామాభ్యాం నమః' అంటూ
శాలువా తలకు చుట్టుకో
'లక్ష్మీనారాయణాభ్యాం నమః' అంటూ
తాళాలు మెడలో వేసుకో
'హరిః ఓం' అంటూ
చెంబు చేతికి తీసుకో

మీ వంశం సనాతనం
మీ తాత వాళ్ళ తాత వాళ్ళ తాత కూడా
యాయావరంతోనే సంసారం నెట్టుకొచ్చారు

మరో మూడు నిముషాల్లో
సనాతనధర్మాన్ని చేరుకుంటావ్
అక్కడ
సతీసహగమనకార్యక్రమంలో
భక్తిశ్రద్ధలతో పాల్గొని వెళ్ళు.

15

అతడు
దగ్గరబంధువు
చిన్ననాటినుండీ తెలుసు
చిన్ననాటినుండీ అన్నీ తెలుసు
నా గురించి తనకూ, తన గురించి నాకూ
అందుకే
మనస్సులకు దూరంగానే ఉంటాం

ఇతడు
సన్నిహితమిత్రుడు
నాగురించి కొంచెమే తెలుసతనికి
తన గురించి నాకూ అంతే
ఒకరి జీవితపుపొరల్లోకి మరొకరం చొరబడం
అందుకే
మనస్సులకు దగ్గరగానే ఉంటాం

16

మాట
ఒక మంచుముక్కే కాదు
ఒక ఇనుపరెక్క కూడా
కరుగుతూ కరిగించగలదు
విరుగుతూ విరిచేయగలదు
పైగాయం మానిపోయినా
పాతనొప్పి మాత్రం పదిలమే

ఆట
ఎప్పుడూ వినోదకరమే
గెలిచినా ఓడినా
ఎప్పుడూ ప్రమాదకరమే
ఓడినా గెలిచినా..
మాటతోనే ఆటైతే
ఆడుతూ ఉన్నా ప్రమాదమే

17

అందం
దృశ్యంలో ఉంటే
అందరికీ అందంగా కనిపించాలి
అందం
కంటిలో ఉంటే
అన్నీ అందంగా కనిపించాలి..

అలా లేదేం మరి?
ఆ ప్రమాదపు టంచుకు
మనమింకా చేరలేదేం మరి?

అందుకే
సౌందర్యం ఒక మాయ
సౌందర్యదర్శనం మరోమాయ
రెండు మాయలకూ లోబడ్డ
దృశ్యనయనసంబంధం అసలైన మాయ

ఆ మాయవల్లనే గదా
తాపసులకు సైతం తపన కలిగేది
ఆ మాయ వల్లనే గదా
తపస్సులు కూడా గంగలో కలిసి
సరిగంగ స్నానాలే శాశ్వతంగా మిగిలేది

18

అవసరానికి మించిన ఆధ్యాత్మికతతో
అడ్డంగా పునీతమైన జాతిలో
మనసు మొదళ్ళల చెదపురుగులు చేరి
దారితప్పిన మనుషులే దార్శనికులై
కాటుపోయిన పాలమీగడలతో
జ్ఞానరాశిని వండి వడ్డిస్తున్నారు

మబ్బు ఎంత గాఢంగా పట్టినా
చినుకుగా మారి కురిస్తేనే విలువ
చెట్టు ఎంత లోతుగా ఊడలు దిగినా
నీడగా మారి నిలిస్తేనే విలువ
నది వరదలై ప్రవహించినా
పసిడిపంటలై పలకరిస్తేనే విలువ

19

తనకు పదవి
కాలం కలిసి వస్తే
ఇంటిల్లి పాదికీ పదవి
తాను పోతే
సంతానానికీ పదవి
ఛీ ఛీ ఛీ...ఏమిటీ వారసత్వ రాజకీయాలు

తనకోసం కుటుంబమంతా కష్టపడింది
అయినా అక్కకూ లేదు, చెల్లికీ లేదు
అన్నా తమ్ముళ్ళకు అసలు ప్రవేశమే లేదు
పదవీవైభవ మంతా తనకు మాత్రమే
ఛీ ఛీ ఛీ.. ఏమిటీ స్వార్థరాజకీయాలు

మీ రెలా ఉన్నా మేమింతే
ఇది ప్రజారాజకీయం

20

భారత్‌లో బ్రిటిష్ నాగరికత పాదం పెట్టింది
'చేత్తో తింటారా?! ?!'
అన్నాడు వాడు ఆశ్చర్యంగా
అవును గదా ..సిగ్గు పడ్డాం
స్పూన్ తో తింటా మన్నాం.
మన నాగరికత రూపు మారింది

విశ్వనాగరికతతో పరిచయమైంది
అమెరికా నాగరికత ఆత్మీయికమైంది
'స్పూన్ తో తింటారా?!?!' అన్నాడు వాడు
అవును గదా..పశ్చాత్తాపపడ్డాం
నోటితో పీక్కొని తింటా మన్నాం.
పిజ్జాలు, బర్గర్లు, సబ్బులు, రోళ్ళు...

బానిసతనానికి తిండైనా తిరిపెమైనా ఒకటే

21

వచ్చి అడిగి నప్పుడు వామనుడైనా
తీసుకున్న తర్వాత త్రివిక్రముడు
స్తంభాన్ని చీల్చుకొని ఇరుకుదారిలో వచ్చినా
సింహద్వారాన్నే ఆక్రమించిన నరసింహుడు
ఊరుకన్నా దారి ఎప్పుడూ చిన్నదే
నరంకన్నా శరం ఎప్పుడూ బలహీనమే

గింజను బట్టి చెట్టు ఎత్తు తెలియదు
రంగును బట్టి రుచి తెలియదు
కొబ్బరితో పాటు
చిప్పనూ తినేవాడుంటా డెక్కడో
వాడికి భయపడాలి
అడుగడుగూ ఆచి తూచి వేయాలి

22

కత్తులతో నైనా కరచాలనం చేయవచ్చు
కానీ చేసేముందు
తేనె మరకలున్నాయేమో గమనించాలి
లీలామాత్రంగా కనిపించినా
గీతావాక్యంలా భావించి
గీత దాటకుండా ఉండాలి..
వాటికి పిడిదగ్గరకూడా పదునే

మైపూతలు లేకుంటే
వాదర ధగధగలాడుతున్నా సరే
చేతితో తడమనూ వచ్చు
సాము చేయనూ వచ్చు
ఎందుకంటే
అది ఏం చేసినా ఎదుటపడి చెప్పే చేస్తుంది
దొంగదెబ్బలూ వెన్నుపోట్లూ దానికి నచ్చవు.

23

ఒకడు మృగాడు
కీచకుడు
కామపురుషార్థంలో
హద్దులు అతిక్రమించాడు
ఎన్‌కౌంటర్లో
నిలువునా కూలిపోయాడు

ఒకడు ప్రయోజకుడు
కలవాడు
అర్థపురుషార్థంలో
ఆంక్షలు అతిక్రమించాడు
జనుల మద్దత్తుతో గెలిచి
జగా లేలుతున్నాడు

24

"చిత్తశుద్ధి నశించింది
రసికత లేని మైథునం
అసమర్థనిర్వహణం
అరగని ఆరగింపులూ
వచ్చిపడి పీడిస్తున్నాయ్"
జరుక్ శాస్త్రి గారూ!
మీరు లేరు, మీ మాటలు ఉన్నాయ్...

మేమున్నాం
మీ మాటలూ అలాగే ఉన్నాయ్
మా చేతలు అలాగే ఉన్నాయ్
మీరు శ్రీవిద్యోపాసకులు
శ్రీవిద్యోపాసకులమైనా
శ్రీశ్రీవిద్యోపాసకులమైనా మేమంతా ఒకటే
మా హిపోక్రసీయే మా డెమోక్రసీ

25

వందతప్పులు దాటగానే
కుత్తుకల నుత్తరించటానికి
ఇప్పటి దేవుడు పాతదేవుడిలా కాదు
ఈయనలోనూ మానవత్వం(అనకూడదేమో)
ఎంతో కొంత విరిసినట్టుంది
ఎంత పెట్రేగిపోయినా ఎన్ని మోసాలు చేసినా
మళ్ళీ మళ్ళీ హెచ్చిస్తూనే ఉంటాడు

సంభవామి యుగే యుగే' అన్న హామీని
నిజం చేసి నిరూపించటానికి
ఇప్పుడున్న అవినీతి చాలటం లేదేమో!
రండి! తలా ఒక చెయ్యి వేసి
తప్పుల సంఖ్యను పెరగనిద్దాం
మూడుపువ్వులూ ఆరుకాయలుగా
అవినీతిని పండించి బండ్ల కెత్తుదాం

26

నాకు రాగద్వేషాలు ఎక్కువట
అందరూ ఆడిపోసుకుంటుంటారు
ఒట్టేసి చెపుతున్నా నన్ను నమ్మండి
నా స్వార్థానికి అడ్డుపడితే
నామరూపాలు లేకుండా చెయ్యాలన్న
ద్వేషమే తప్ప
నాకు రాగ మసలు లేదు

ఎప్పుడైనా నాలో వైరాగ్యం పొడసూపితే
అది అనుపలబ్ధివైరాగ్యం
అది అప్రాప్తయౌవనబ్రహ్మచర్యం
అది విలుప్తేంద్రియసన్యాసం
ప్రక్కటెముకలు విరిగిన ప్రపంచానికి
వెన్నెముకనూ విరిచే
విలక్షణవిన్యాసం...

27

నీ కోడి కూసిందే వేళ అంటావ్
నీ స్వరం పలికిందే వేదమంటావ్
నీకూ నాకూ స్వరాలలో తేడా వస్తే
నా కోసమే హోమకుండంలో
మరిన్ని సమిధలు వేసి
మంట పెరగకుండా చూసి
అన్నాహుతులతో పొగబెడతావ్

అందరం కలిసి బ్రతుకుదామని నేనంటే
ఎవరి బొటనవ్రేలు వాడిదే అంటావ్
ఎవరి కనుపాపలు వారివే అంటావ్
అక్షరాలా నిజం ..
అందుకే నేమో!..
అందరూ సద్ధర్మచక్రవర్తులూ కాలేరు
అందరూ నీటుగాడైన నిగమశర్మలూ కాలేరు

28

ప్రపంచమంతా అల్లకల్లోలమైతే
ఆయుధాలు అమ్ముకొని బ్రతుకవచ్చు
ప్రపంచమంతా శాంతిసౌధ మైనా
తెల్లగులాబీలు అమ్మి బ్రతుకవచ్చు
పాలవ్యాపారం పడిపోతే మాత్రమేం
నీళ్ళసీసాల నమ్మి నిశ్చింతగా బ్రతుకవచ్చు
అమ్మకం చేతకావాలి కానీ

అమ్మకూడనిదంటూ ఏదీ లేదు
నీళ్ళసీసా మూతిపొడవును
మూడు ఎమ్ ఎమ్ లు తగ్గిస్తేచాలు
గెగాబైట్స్‌లో డేటాను పెంచినా
మెగాబైట్స్‌లో వేగాన్ని తగ్గిస్తే చాలు...
నేత పలచగా ఉన్నా
గంజి దట్టంగా పెడితే చాలు

29

సుభాషితాల మహాసభలో
సుప్రభాతాలనుండీ
ఏకాంతసేవలదాకా
సర్వసూక్తులూ ప్రతినిధులే
నోటికే తమను పరిమితం చేసి
చేతల్లో మొండిచేతులు చూపిస్తున్నారని
ప్రతిసూక్తీ ఆందోళన వ్యక్తం చేస్తోంది

సుదీర్ఘచర్చల అనంతరం
సూక్ష్మంగా తీర్మానం చేశాయి
'మనవన్నీ పాతరూపాలు
ఎవ్వరికీ నచ్చటం లేదు
మనలాగా మనుషులు ఉండకపోతే
మనుషుల్లాగా మనం మారిపోదాం
భేషజాలకు పోతే ఉనికికే ప్రమాదం'

30

వినియోగవేళలో
విషాదకావ్యాలైనా
ముగింపు ముచ్చటగా ఉంటే
అదో తృప్తి
అవతరించిన వేళ
ఆటుపోట్లకు గురియైనా
ముగింపు దివ్యంగా ఉంటే
అదో నమ్మకం

కాలం అనుకూలించకపోతే
నరుడైనా నారాయణుడైనా
బలహీనులే
అవతారాల ముగింపువేళ
అందరిలా సాగిపోయినవారే

31

పచ్చి స్వార్థమే రాజ్య మేలుతున్న రోజుల్లో
మా వాడొక్కడే పరార్థజీవి
అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుల్లో
అంతటి చొరవ ఎక్కడా చూడలేదు

మన డ్రైవరుకు వాడే ఫోన్ చేస్తాడు
మనం వాటర్ బాటిల్ కొంటే
వాడే పట్టుకొని ప్రారంభిస్తాడు
మన తిండి వాడే తెప్పిస్తాడు
మన కాఫీ వాడే ఆర్డర్ చేస్తాడు
మనకే బిల్లు కట్టే అవకాశం ఇస్తాడు

కొత్తవాళ్ళను పరిచయం చేస్తే చాలు
రెండిళ్ళ మధ్యదూరం రెండ్రోజుల్లో తగ్గుతుంది
అంతటివాణ్ణి కావాలని నేను అహర్నిశలూ తపిస్తున్నా..
అయినా అనుమానమే ఈ జన్మకు...

32

వ్రాసింది ఒకే కావ్య మైనా
ఆవిష్కరణలు అనేకం
సన్మానాలూ సత్కారాలూ
ఊరు మారిన ప్రతిసారీ
అంతో ఇంతో సభావ్యయం
వ్రాయకుండా ఉంటేనే బాగుండేదన్న
రాక్షసనైరాశ్యభావం

వస్తువు ఒక్కటే అయినా
చేయో రూపమో మారిన ప్రతిసారీ
జి.ఎస్.టి కడుతున్నాం గదా
సభాపోషకులూ కళాపోషకులూ
విద్యాపోషకులూ...ఇంతేనా..
మనమంతా ఇప్పుడు
ప్రభుత్వపోషకులం కూడా

33

అన్నీ అందరికీ
అన్నికాలాల్లోనూ
అందుబాటులో..
కాలు కదపడాలూ
ఇల్లు దాటడాలూ
వేచి ఉండటాలూ
ఎదురు చూడటాలూ
మచ్చుకైనా లేవు..

ఆనందపు బాటల్లోకి
అసలు ప్రవేశమే లేదు
ఆస్వాదమూ లేదు
అనుభూతీ లేదు
ఉన్న దొక్కటే

వర్తమానంతో అసంతృప్తి
భవిష్యత్తుపై అత్యాసక్తి

34

వాన అంచున అడ్డంగా నిలిస్తే
ఒక చేయి తడి ఒక చేయి పొడి
అలల అంచున అదోలా నిలిస్తే
ఒక కాలు పొడి ఒక కాలు తడి
శిశిరవసంతాల సంధివేళలలో
ఒకటి పండుటాకు
ఒకటి చివురుటాకు

సంధిసమయాలు ఎప్పుడూ అంతే
ఆదికీ అంతానికీ అవే ప్రతినిధులు
ఆ కొద్ది క్షణాలే
ఒక జననానికీ
ఒక మరణానికీ
విపులభాష్యాలూ
విస్పష్టావతారికలూ

35

ప్ర వక్తలను ప్రశంసించటమే కానీ
ప్ర శ్రోతలను పలకరించరేం కనీసం ?
వినేవాడే లేకుంటే
కరువలికి ప్రవచిస్తారా?
ఎత్తి కుదేస్తుంది ..దాని కన్నీ తెలుసు..
నేలకు చెప్తారా?..భూకంపాలు పుట్టిస్తుంది
దాని కసలే ఒళ్ళంతా తిరుగుడు..
నీళ్ళకో నింగికో నిప్పులకో చెప్తారా?
ఏదైనా ప్రమాదమే
మనలో మనంగా ఉండి
మన నాటకాలు కళ్ళారా చూస్తున్నా యవి

అందుకే శ్రోతృదేవో భవ అందాం
అందరికీ నమస్కారాలు మాటల్తో కాదు..ఆచరిద్దాం
ప్రశ్రోతలకూ ఇవ్వమందాం పద్మపురస్కారాలు

36

అరిసెలు అన్నిచోట్లా దొరుకుతాయి కానీ
రుచి రసవంతం కావాలంటే పదిమందీ కలిస్తేనే
మధ్యలో పొయ్యి పెట్టి చుట్టూ నలుగురూ చేరితేనే
చిట్టిచేతుల చిన్ని అరిసెలు చిత్రరూపాలతో
కేటాయింపుగా కాలి నేతిబ్రతుకును సార్థకం చేస్తేనే
ప్రపంచాన్ని గెలిచినంత సంతోషం పాకంగా మారి
అర్థరాత్రి దాకా అందరిళ్ళలో అమృతమైతేనే

వేయికళ్ళతో పెద్దవాళ్ళు వేడినేతిని అదుపు చేస్తుంటేనే
నాలుగుచుక్కలు చెదిరి మీదపడినా
నవనీతం స్నిగ్ధభావంతో వాటిని అనునయిస్తుంటేనే
చేతులు మారేకొద్దీ పెరుగుతున్న రుచితో
ఆ ఇంటివీ ఈ ఇంటివీ అంటూ హడావుడి చేస్తుంటేనే
ఒకే అంగడిసరుకై ఉసూరుమంటూ బ్రతుకై
ఇప్పుడు వీథికంతా ఒకేరుచి...బ్రాండెడ్ అరిసెలతో

37

ముత్యాల్లాంటి చిరు సంతసాలను
శిథిలశకలాలను చేసుకొని
పెద్దపెద్ద సంతోషాలకై
పెనుభారాలను భుజాల కెత్తుకొని
రెంటికీ చెడిన రేవళ్ళమై
మింటికీ మంటికీ మధ్యస్థులమై
త్రిశంకువుతో చేయి కలపాలా?

తనువుకు తగిన తాలిమి
మనసుకు సరితూగే మాలిమి
పరిణతికి తగ్గ పలకరింపులూ
అలకలకు తగ్గ అలరింపులూ
పుల్లా పుడకా ముక్కున కరుచుకున్న చిలుకలా
కణమూ కణమూ తేనె దాచిన ఈగలా
మనుగడ మననగీతికలా సాగుతుంటే!...

38

శిశిరం మంచుపొర కప్పినంత మాత్రాన
వసంతం కిసలసన్యాసం పుచ్చుకోదు
మబ్బులు మొగమంతా కప్పాయని
సూర్యుడు కిరణసన్యాసం స్వీకరించడు
నీళ్ళు వచ్చి ఇసుకను ముంచెత్తాయని
కాలువ ఇలాతలసన్యాసం వైపు మొగ్గుచూపదు
అవి ప్రకృతివిన్యాసకథాప్రబంధాలు

మరి మనమేమిటి?
మన చిరుజల్లుల సునామీ లేమిటి?
గోరంత కష్టం వస్తే కొండంతగా కుమిలిపోతలా?
మరకలు పడ్డాయని మనస్సునే చంపుకోవడాలా?
అడుగు తడబడితే కాళ్ళనే నరుక్కోవడాలా?
మనదంటూ ఒక బ్రతుకుందీ
దానికంటూ ఒక లయా ఉంది....ఇంకేం కావాలి?

39

నిన్నటిదాకా నిశానీదారు లని
వాళ్ళనూ వీళ్ళనూ చూసి నవ్వుకున్నామా?
ఇప్పుడు చూడండి కాలచక్రపు తిరుగుడు
అక్షరాస్యులంతా కూడా అంగుష్ఠమాత్రప్రమాణులై
వందేళ్ళ బ్రతుకునూ అందులోనే దాచుకొంటున్నారు
అలనాటి ఏకలవ్యగురువు మామూలు మేధావి కాదని
అర్థమై ముక్కు మీద బొటనవేలేసుకుంటున్నారు...

ఓడలు బండ్లు అవుతాయి
బండ్లు ఓడవులవుతాయి
అని ఎదురు చూడటమే కానీ
అంత అవసర ముందా?
ఊళ్ళు నదులవుతున్నాయి
నదులు ఊళ్ళు అవుతున్నాయి
సరిపోతుందిగా!!!

40

అంగవస్త్రం పిండి నా భార్య పుణ్యం కట్టుకుంటుంటే
అది చూసి భరించేంత సహృదయుణ్ణి కాను నేను
చీర పిండి నేనూ పుణ్యం కట్టుకుందా మంటే
'ఛీ ఛీ అపభ్రంశపు పనులు చేస్తున్నావ్
సచేలస్నానమే ప్రాయశ్చిత్తం' అంటున్నారు

అయినా వండుకోవటాలూ
పండుకోవటాలూ మానేసి
ఈ పిండుకోవడాలేమిటో?
చిత్రగుప్తుని చిట్టాలను
చెండుకోవడాలేమిటో?
అపౌరుషేయతాభక్తి అవధులు మించి
వేదాలు వెనక్కువెనక్కు పోయినట్టు
చాదస్తపు ప్రవచనాలతో
సామాజికశాస్త్రాలు చతికిలబడతాయేమో!

41

అంతర్యామీ అని పాడుతూనే ఉంటాం
అలుపు సొలుపులతో మెట్లెక్కుతూనే ఉంటాం
ప్రహ్లాదుడి కథను పరమభక్తితో వింటూనే
స్తంభాల కానుకొని కునుకుపాట్లు పడుతూ ఉంటాం
కథలైనా గాథలైనా కాలక్షేపాలే మనకు
కాలం కాటు వేసిన కరవాలాలం మనం
ఎటు త్రిప్పిచూసినా తుప్పే

స్తంభంలోనే కాదు
మన గుండెల్లో కూడా ఉన్నాడో లేదో అనుమానమే
ఉంటే..ఉన్నాడన్న నమ్మకమే మన కుంటే
ఇహపరాలూ మెచ్చని పనులు చేయగలమా?
అహరహమూ ఆషాఢభూతులమై మనగలమా?
తన కంట పడతామన్న భయమే మనకుంటే
ఇన్నిన్ని పగటివేషాలు ఇంటా బయటా వేయగలమా?

42

తరువు లన్నీ అంతే
వేర్లు నేలలో..తలలు నింగిలో
ఎత్తిన తలలతో పచ్చతివాచీ పరుస్తాయి
అడుగు కూడా నేల తగులనీకుండా
అహస్కరుడికి ఆహ్వానం పలుకుతాయి
పాదచారులకు మాత్రం పట్టినగొడుగులై
సెగ తగులకుండా సేదతీరుస్తాయి

మన కున్నంత లౌక్యం వాటి కేదీ?
ఎవ్వరూ నరక్కుండా
కాళ్ళు కాపాడుకోవటం మనకు ఎంత కష్టం?
ఎవ్వరూ గోతులు త్రవ్వకుండా
కాలిక్రింద నేలను దాచుకోవటం ఎంత కష్టం?
అందుకే గదా ఒంటికాలి మీదనో
మునివ్రేళ్ళమీదో నిలిచి మహర్షులు తపించేది

43

నిచ్చెనలు సిద్ధం చేసుకున్నాం కానీ
వెంపలచెట్లే కనిపించటం లేదు.
కనుకట్టు విద్యలకు కాలం చెల్లినా కానీ
గారడీల గమ్మత్తులూ అంతరించటం లేదు
సంపదలు సర్వాన్నీ శాసిస్తున్నాయి
అలలు ఉప్పొంగుతూనే ఉన్నాయి కానీ
చేపకొమ్ముపడవ కదలిరావటం లేదేం?

ఉదధి ఉరికితేనే యుగాంత మంటే
హృదయపాథోధు లెన్నిమార్లు ఎగిశాయో!
కలలన్నీ కల్లలైతేనే కలియుగాంతమైతే
చిరుతల ఆశయాలెన్ని చితికిపోతున్నాయో!
ఇప్పటికే యుగాంత మంటూ
ఎన్నిసార్లు వ్యాపారాలతో మజా చేశామో!..
'విత్తనాల సంచితో సావర్ణి రాడేం ?'

44

తప్పొప్పుల పట్టింపు లేకుంటే
కాలిక్యులేటర్ కంటే వేగంగా లెక్కలు చేస్తా డొకడు
రుచీ శుచీ తో సంబంధం లేదంటే
వేలమందికైనా వండివారుస్తా నంటా డొకడు
పిందైనా పండైనా తేడా లేదంటే
తోటంతా క్షణంలో కోసి చూపిస్తా నంటా డొకడు
అది తెగింపు...తెగ ఇంపు మాత్రం కాదు

ఆలోచనలన్నీ వ్యూహాలు కావచ్చు
పరిణామాలన్నీ పసందుగా తోచవచ్చు
ఫలితాలన్నీ పిలిచినట్టు మాత్రం రావు
ఎన్ని రంగులు ఎండితేనో ఒక బొమ్మయ్యేది
ఎన్ని కాగితాలు చెదరితేనో ఒక చిత్ర మయ్యేది
ఘుణాక్షరన్యాయాలను గ్రుడ్డిగా నమ్మామంటే
కుక్కమూతిపిందెలు కూడా దిక్కులను పాలిస్తాయి

45

ఆలోచనలు శాస్త్రజ్ఞులవి
నిధులు ప్రజలందరివి
శారీరకశ్రమ కార్మికులది..
ఎవరో వస్తారట
జాతికి 'అంకితం' చేస్తారట
చేసేవారికైనా ఉండాలి
చూసేవారికైనా ఉండాలి..?

చిలికింది దేవతలూ దానవులూ కలిసి
ఒలికింది అక్షరాలా అమృతం పులిసి
తోకవైపుపట్టినవాళ్ళు తెలివిగా మెలిగారు
తలవైపు వాళ్ళను మోహంతో తన్ని తగలేశారు
ఇదేం న్యాయ మని ఒక్కడడగ బోతే
రెండు ముక్కలు చేసి.. ఇక బ్రతుకు చూద్దా మన్నారు
వాక ఏదైనా వాటమంతే...చాకి రొకరిది సౌఖ్య మొకరిది

46

మూడంకెలు
నాలుగంకెలు
అయిదంకెలు
ఆరంకెలు
ఏడంకెలు
ఎనిమిదంకెలు
తొమ్మిదంకెలు

వేతనాలు పెరుగుతూనే ఉన్నాయ్
వెతలు వాటి వెంటబడుతూనే ఉన్నాయ్
ఆనందాలు అవధులు మించుతూనే ఉన్నాయ్
అసంతృప్తులు అడ్డగోడలై నిలుస్తూనే ఉన్నాయ్
బంధాలు ఎక్కడికక్కడ ముడిపడుతూనే ఉన్నాయ్
ప్రజాతంతువులు ప్రమాదాల్లో పడుతూనే ఉన్నాయ్
ఎక్కడో పొరపాటు జరిగింది...భూమి గుండ్రంగా లేదేమో!!!

47

ఎవరి బ్రతుకును
వారు ప్రేమిస్తారు కవితాశైలిలా
ఎవరి వ్యూహాన్ని
వారు అమలుచేస్తారు పదప్రయోగంలా
ఎవరి లాభాలను
వారు అనుభవిస్తారు ఆనందసిద్ధిలా...

మధ్యలో మనమెవరం? ధర్మాలు వల్లించటానికి.....

వాడి లోకంలో వాణ్ణి బ్రతుకమందాం
చరిత్రలో శిథిలశిల్పంలా
వాడి వ్యూహాన్ని వాణ్ణి అమలు చేయమందాం
కారడవిలో కార్చిచ్చులా
వాడి ఆనందాన్ని వాణ్ణే అనుభవించమందాం
ఎడారిలో ఎండినమొక్కలా...

మన నెత్తికెక్కినప్పుడే గదా మనం ప్రశ్నిస్తోంది!

48

ప్రహరీగోడలు తొలగించుకుంటే
ప్రపంచమంతా మనదే
బంగారుగనులు కూడా
ఇంటిపిల్లలు ఆడుకునే బొమ్మరిళ్ళే
సప్తసముద్రాలూ మన ఇంటిపెరట్లో
కూరగాయలు పండే పంట దొరువులే
కొండలు ఎక్కి దిగవచ్చు ప్రతిరోజూ వాహ్యాళిలా...

మన మనసుకే కుళ్ళు
అంత ఆస్తి మనదవుతుంటే అది భరిస్తుందా?
పైగా దెప్పిపొడుపులు
ఇరుగుపొరుగులతో నాకున్న
సరిహద్దుల గొడవలన్నీ ఏకరువు పెడుతుంది
తలచుకుంటేనే భయమేస్తుంది
నా చుట్టూనే ప్రహరీ కట్టుకొని దాగిపోయేంతగా

49

ప్రారంభం సాహిత్యసారంతోనే
చుక్క గడవగానే తాత్త్విక మవుతుంది
క్షణం గడవగానే ఆధ్యాత్మిక మవుతుంది
పూట గడవగానే పుణ్యలోకాలవైపు నడుస్తుంది
మాపటివేళకు మోక్షం దగ్గర ఆగుతుంది
మొదలెట్టిన సాహిత్యం ఉడికిపోతుంటుంది
అంతా నా కర్మ అంటూ తలకొట్టుకుంటుంటుంది..

పాలపొంగు ఆకలి తీర్చలేదు
సునామీలు దప్పిక తీర్చలేవు
'నాలుగు వ్రేళ్ళూ నోట్లోకి పోతేనే'
పగటిపూట వెన్నెలలు విరిసినా
ఆనందానికి దార్లు అవే తెరుచుకున్నా ..
నీరససాహిత్యం నిరనుభవతత్త్వం
జుట్టూ జుట్టూ పీక్కుంటుంటుంటుంటున్నా ..

50

కళ్ళు మూసుకుంటే ప్రపంచ మంతా లేనట్లే
అరికాళ్ళు మూసుకుంటే భూమినంతా మూసినట్లే
చెవులు మూసికొని వింటే చాలు
పెదవులెలా కదలినా మధురగీతరవళులే
మరచెంబులో పెట్టి మనసును పాతేస్తే
భావాల బండారం బట్టబయలైనట్లే
కదలకుండా కూర్చుంటే ఎప్పుడూ జారిపడనట్లే

తత్త్వవేత్తలు అలా ఉండమనే చెప్తారు కానీ
అసలు తత్త్వం అలా ఉండ దని చెప్పబోతే
నిలువునా పాతేస్తారు ఆనవాలు తెలీకుండా
వారి తత్త్వంలో రెండో భాగ మదే మరి...
పుట్టిందెందుకో చెప్పమంటే చావడానికే అంటారు
మధ్యలో బ్రతుకుమీద విరక్తి ఎందుకంటే
గుర్రుగా చూస్తారు గుండె చిట్లిపొయ్యేలా

51

ప్రతిమాటా విశ్వగీతమై
ప్రతినోటా పలుకుపాటయై
ప్రతి కన్నూ కరుణాకృతియై
ప్రతి మన్నూ మమతాధృతియై.
ప్రతిచేయీ మరొక్కచేతిని
పెనవేసిన ప్రేమావృతియై
కలగలసిన మానవమననం
ఫల మిచ్చిన సాగరమథనం...

విశ్వానికి పూచిన విరియై
వేకువలో పిలిచిన పిలుపై
ఒక్క వేకువకల చాలు
కానీ ఎలా?
సుషుప్తితోనో విరక్తితోనో
దివారాత్రాలు దిగులవుతున్నాయే!...

52

ఒంటరిగా ఉండాలనిపిస్తోందా?
ఆలోచనలను అలా అలా అలా గాలిలో
అలలు అలలుగా ఎగరెయ్యాలనిపిస్తోందా?
అప్పుడు మన మనస్సు ఏం చేస్తోందో
ఆదమరవకుండా గమనించాలనిపిస్తోందా?
ఎన్ని మరలా మన భుజం మీద వ్రాలాయో
ఎంచి ఎంచి ఏకాంతంలో దాచాలనిపిస్తోందా?
....
ఒంటరిగా ఉండి ఏం చేయాలని?
పరమాత్మలా ఒంటరిగా నిలవాలంటే
అంతగానో అంతలానో అంతలోనో
సమాజమే మనమై పోవాలి గదా!
అన్నింటిలో భాగమై ఆయన ఒంటరిగా ఉంటే
అన్నింటినీ వదిలి మన పలాయన మేమిటి?
శుష్కవేదాంతాలూ శూన్యప్రగల్భాలూ కాకపోతే?

53

భూమిలో ముప్పాతికవంతన్న పేరే గానీ
మూడుచుక్కలు కూడా పనికిరావు సాగరజలాలు
దప్పిక తీరాలన్నా దావాగ్ని ఆరాలన్నా
పొలాలు తడవాలన్నా పంటలై పొంగాలన్నా
ఆవిరిగా మారి ఉపరితలాలకు ఎగిసి
మేఘాలు వడగట్టి నేలకు జార్చేదాకా
మరో దారి చూసుకోవలసిందే

కుప్పలు తెప్పలైన ఉప్పులవల్లే గదా
అనాదిగా ఆ కడలి అవే ఉరకలతో
నీలంగా నిర్మలంగా నిత్యనూతనంగా సజీవంగా
పావువంతు భూమికి ముప్పావువంతు అన్నాగారంగా
అక్షయనిధిగా హద్దులెరిగిన విధిగా
అలుపెరుగని ఆటగా ఆలాపన మాటుగా
అలలతో తీరంలో చెమ్మచెక్కలాడగలిగేది

54

కళ్ళిచ్చాడు కాళ్ళిచ్చాడు
ఒళ్ళిచ్చాడు ఓపిక ఇచ్చాడు
అందమైన ప్రకృతిని ఆవిష్కరించాడు
అశనాయాపిపాసలను ఆరోపించాడు
ఆనందానికి రూపాన్నిచ్చాడు
అహరహమూ అందుకోసమే
ఆరాటపడే మన సిచ్చాడు...

ఇంకా ఎందుకు ఎక్కి ఎక్కి ఏడుపు?
ఇంకా ఎందుకు మాటల దిగదుడుపు
ఫలానుభవాలను పంచుకోవడంలో
అందరికీ లోకువై అలమటించటం
ప్రకృతికే తలవంపులు తెచ్చి
పలాయనాలు పదే పదే చిత్తగించటం...
బరువు ఎటు ఉన్నా మొగ్గు మనవైపే కావాలా?

55

కంచులోటా చేతికి తీసుకొని
ఇత్తడిబిందెలో నీళ్ళు ముంచుకొని
అక్కడే నిలబడి నోటికి అంటించుకొని
రొప్పుతూ రోస్తూ తాగుతున్న పసివాణ్ణి
ఒరే అంట్లవెధవా అంటూ
ఒక్కటేసి వీపుమీద ..కసురుకొంటూ
బిందెడు నీళ్ళూ క్రుమ్మరించుకున్నారే...

దోసె..దాని ఒళ్ళంతా చాక్ లెట్ పేస్ట్
చేతికి కొంతా మూతికి కొంతా
కడగడాలూ లేవు...
కాగితంతోనే తుడుపుడు
అదే చేత్తో కరచాలనాలూ ..
ఇప్పుడు రండి.
ఏం క్రుమ్మరించుకుంటారో చూద్దాం

56

మంచు కురుస్తూ ఉన్నప్పుడు
మొగ్గ విరుస్తూ ఉన్నప్పుడు
ఒక మబ్బుముక్కమాటునుండీ
శశి ప్రక్కకు జారుతూ ఉన్నప్పుడు
నిశి చీకటితనువు చాలించి
వెలుగురేఖగా ఉదయిస్తూ ఉన్నప్పుడు
అప్పుడు అన్వేషించాలి అందాలకు అర్థాన్ని

స్థితికన్నా గతియే తీర్చిన రసాకృతి
మతి కన్నా కృతియే మహోదయానికి సహకృతి
మధువూ సుందరమే శిశిరమూ మకరందమే
పైరగాలులతోనూ తనువంతా పులకింతే
సుడిగాలులలోనూ గడిదేరిన వడి అందాలే
చూపు నాటిందా.. కదలికలన్నీ అందాల నయాగరాలే...
బ్రతుకంతా మన్నుతిన్నపామేనా?...కొంచెం కదులుదాం

57

మనం చెప్పకుండా ఆగగలమేమో గానీ
వాడిని అడగకుండా ఆపగలమా?
అంతరాంతరాల్లోని ఆలోచనాంకురాలను
పెళ్ళగిస్తే గానీ వాడికి నిద్దుర పట్టదే
మనదంటూ ఒక మనుగడ ఒక అమరిక
అసలు వాడికి నచ్చదే ..తాను అందరివాడూ
అందరిబ్రతుకుల్లోనూ స్వేచ్ఛగా చొరబడేవాడూ

వాడికి కళ్ళకూ కాళ్ళుంటాయి
కాళ్ళకూ కళ్ళుంటాయి
వాడు జైలుగోడ లాంటివాడు
లోపలకెవ్వరూ రాకుండా రక్షిస్తాడు
మనం బయటకు పోకుండానూ ఆపేస్తాడు......
లోకాన్ని చదవటం నేర్చుకొనే దాకా
ఏకాకిగా బ్రతకటమే ఎంతో మంచిదేమో!

58

కాలంకన్నా ముందు మనం నడుస్తుంటే
మన తపన ఆపటానికి దానికేం పని?
తాను తపనపడి దాటడానికీ దానికేం అవసరం?
మనం మరీ అంతగా ఎగిరిపడుతుంటే
మనలను హఠాత్తుగా వెనక్కు త్రిప్పుతుంది
మళ్ళీ మనం కాలం వెనుకనే.. దాని నీడలోనే
అది మన ముందే ఠీవిగానే.. చలనరూపంగానే

ఆశ మరీ ముందుకు తోస్తే
భయం మరీ వెనక్కు లాగుతుంది
ఆశ అవధులు దాటుతుంటే
కాలానికీ అందనంత ముందుకు పోతాం
భయాలు ఎక్కువై గుండె చిక్కబడితే
కాలాన్ని అందుకోలేనంత వెనుకబడిపోతాం
సమాంతరంగానే సాగితే!..సమాజమే మనమై నిలవమా?

59

అన్నీ మనకే
అన్ని ఆలోచనలూ మనకే
అంతుచిక్కని ఆశలూ మనకే
అలవిమాలిన అహంకారాలూ మనకే
ముద్దగా ఉన్నామో ముక్కలవుతున్నామో?
ఎవడి ఎరుక వాడికి గొప్పది...పరక పెరవారిది
బ్రతుకంటే భయంతో పరుగు మాత్రమే మనది

జీవజాతులు కోకొల్లలు
జీవనగమనాలు అనంతప్రకారాలు
ఆత్మరక్షణ తప్ప మరో ఆందోళన లేకుండా
అన్నీ హాయిగానే బ్రతుకుతున్నాయి
తెలివి అనుకున్నా తెలివితక్కువ అనుకున్నా
తెలిసే తెలివిగానే బ్రతుకుతున్నాయి
మరి మనమే ఎందుకిలా?..ఏదోలా..అయోమయంలా...

60

మనం అడగకుండా ఆగగలమేమో గానీ
వాడు చెప్పకుండా ఆపగలమా?
ప్రపంచమే ప్రవచనమై పోయి
ఆధ్యాత్మికత అడ్డదారిగా మారిపోయి
వేకువ నిద్దురలకు మేలికొలుపు వేడుకగా
కుదరని విషయాలకు కూలంకషభాష్యంగా
పొసగని సిద్ధాంతాలను పొంగి పొంగి చెప్తుంటే..

నమ్మకాలకు అలవిమాలని పరిష్కారాలనూ
అమ్మకాలకు అడ్డురాని నీతివాక్యనిర్మాణాలనూ
ఉదారంగా ఊపిరాడనంతగా ఉపదేశిస్తూ
పారితోషికాన్ని మాత్రమే ఆత్మార్పణం చేసుకుంటూ
పురావైభవాన్ని అడ్డంగా నరుకుతుంటే
వెక్కి వెక్కి సస్వరంగా రోదించే బ్రహ్మవిద్యను
ఏ మాయమాటలు చెప్పి ఓదార్చగలం?

61

దూరపు కొండలు నునుపే గాదు
దగ్గరగా చూస్తే బల్లపరుపు కూడా
ఎన్ని కొండల మీద కోటలు వెలయలేదు?
ఎన్ని బండల మీద పహరాలు నిలవలేదు?
కొండలంటే బండలూ మట్టీ మశానమేనా?
మంచు కట్టుకున్న కంచుకోటలు కూడా..
అవి కరిగిపోక మునుపే కారుణ్యమై ప్రవహిస్తాయి

మనమూ అంతే...మేరునగధీరులం
గరికమీది మెరిసే మంచుచుక్కలం
ఎన్నిసార్లు జారిపడినా ఎగిసిపడుతూనే ఉంటాం
ఎర్రగురిగింజలమై ఎచ్చులకు పోతూనే ఉంటాం
మన మేమిటో మనకు తెలిసినా కూడా
మనం కానిదానికోసమే ఎగబడుతుంటాం...
కొంచెం నునుపూ కొంచెం గరుకూ..బ్రతుకంతా బల్లపరుపూ...

62

ఆకలి తెలియనంతగా ఆటలాడనిద్దాం
హద్దులు తెలియకుండా అల్లరి చేయనిద్దాం
గారాలు పోనిద్దాం గెంతులు వేయనిద్దాం
అలగనిద్దాం అనునయిద్దాం
ఇల్లు పీకి పందిరి వేయనిద్దాం
ఇరుగుపొరుగులతో మాట కలుపనిద్దాం
టీవీలు చూస్తూ డాన్సులూ గేమ్సులూ చేసుకోనిద్దాం

నిన్న నిషేధించిన వన్నీ ఈ రోజు విధించుదాం
నిన్న భయపెట్టినవే నేడు ధైర్యానికి రహదారులు
మన్నుతిన్నపాముల్లా మంచాలకు అతుక్కుపోయి
సామాజిక మాధ్యమాల వీడియోల సునామీలలో
మంచాలతో సహా పిల్లలంతా కొట్టుకుపోకముందే
సాంకేతికవిప్లవాలు సమాజాన్ని కబళించకముందే
"నో డివైస్(జ్) డే" లైనా పాటిద్దాం దింపుడు కళ్ళాం ఆశతో...

63

సవరణల పేరుతో చాదస్తాన్ని ఒలకబోస్తూ ఒకరు
స్పందనల పేరుతో స్వపాండిత్యం ప్రకటిస్తూ ఒకరు
అర్ధరాత్రీ అపరాత్రీ అయినా నొక్కులతోనే ఒకరు
ఎమోజీలు అయిపోయినా వెతికివెలికి తీస్తూ ఒకరు
వాక్ స్థలి గదా అని కబ్జా చేసే తపనతో ఒకరు
చిన్నప్పటి పలకపుల్ల అక్షరాలనూ క్రుమ్మరిస్తూ ఒకరు
నియంత్రణ లేని సౌభాగ్యం..నిరతిశయబ్రహ్మానందం

ఆడిపోసుకుంటామే గానీ ఎవడి బాధ వాడిది
పట్టించుకొనేవారు లేక కొందరూ
పట్టింపులకు పోయి కొందరూ
బ్రహ్మీభూతులైనా అది అందరికీ చెప్పాలని కొందరు
ఉబుసుపోక కొందరు ఊళ్ళేలట మనుకొని కొందరు
తనకు పట్టని నిద్ర పరుల కెందుకని కసితో కొందరు
భౌతికంగా ఎవరికి వారే ఐనా అక్షరాలా ఆత్మీయులై అందరూ....

64

ఒకడు ప్రభుత్వోద్యోగి
పనివేళల్లోనూ బృందగానాలే
ఒకడు వ్యాపారవేత్త
సంగీతముచేత బేరసారము లుడుగున్
ఒకడు నిఖార్సైన కుటుంబి
ఇంట్లోనూ నిరంతరమూ వాక్స్థలివేటలోనే...
కాలర్ పట్టుకొని అడిగేవాడు లేడనేగా!

జనాలు చెడ్డారంటూ ఆవేశపడటం
మనం బాగున్న దాఖలాలు కనిపించినప్పుడే గదా!
అడ్డదారుల్లో మన ప్రయాణాలు
అన్యుల అవకాశాలను దెబ్బతీయనప్పుడే గదా!
కుడితితొట్టిలో బల్లులమై బ్రతుకుతూ
ధర్మబోధలతో జాతిని నిమరటమా?
కాళ్ళు విరిచి పొయిలో పెట్టేవాడు లేడనేగా!

65

బుద్ధి మా శరీరంలో ఉంటే
లక్షణాలు మా కుక్కతోకలో ఉంటాయి
జ్ఞానం మా మెదళ్ళలో ఉంటే
వినియోగం మా విస్తరాకుల కుట్లలో ఉంటుంది
ఆకటికి అన్నం పెట్టకపోయినా
ఆర్తనాదాలకు మా టీకాతాత్పర్యాలు బోలెడు
చమత్కారాలు చేయటానికి మేమే దొరికామా?...కబడ్దార్

నవ్వులలోనూ బుసలే వినిపించే
నాలుగుతలల నాగుపాములం
కట్టూ బొట్టూ చూసి కాళ్ళమీద పడతారేమో
అదే పాదంతో పాతాళానికి నొక్కేయగలం
మాటలలోనే మానధనాన్నంతా మూటగట్టినవాళ్ళం
ఆహార్యంతోనే అందరినీ ఆకట్టుకొనేవాళ్ళం
మాతోనే పెట్టుకుంటావా?..మళ్ళీ కనిపించాలిగా!...

66

తప్పు అని తెలిసీ అడిగేవా డొకడు
ఇచ్చేవా డొకడు... చివరగా తలూపేవా డొకడు
ముగ్గురమూ మాయగాళ్ళం
క్రొత్తజాడీలోని పాతఆవకాయముక్కలం
ముగ్గురి లాభాలూ పెనబడ్డ ముప్పేటచాంతాళ్ళం
పాడుబడ్డనూతుల్లోంచి నీతిజలాలు తోడుతుంటే
ఆ పూట గడిచిపోతుందేమో గానీ....

మనం దారితప్పిన మహామనీషుల మనీ
చెట్టుమీది కాకిగూళ్ళనూ పడగొట్టి
చితులు పేర్చే సింగరాజు లింగరాజుల మనీ
ప్రపంచానికి తెలిసిన రోజు
మనమూ మిగలమూ మన చాంతాళ్ళూ మిగలవ్..
'భవతి భిక్షాం దేహి' అంటూ నాలుగిళ్ళ ముంగిళ్ళలో
ఆర్షధర్మాన్ని అంకురింపజేయవలసిందే!!

67

గజానికొకడుగా ఉన్న గాంధారికొడుకులను
గాలించి ..పరుగెత్తించి..కాల్చివేసే హడావుడిలో
అడుగు కొకడుగా ఆర్థికనేరస్థుడున్నా
అంగుళాని కొకడుగా అవనీతిపరుడున్నా
అందరమూ చూడనట్టు నటిస్తూనే చూస్తూనే ఉన్నాం
ఆ తల్లులూ ఆక్రోశించే స్థాయిలో
అందరమూ కలిసి కాకిగోల చేస్తున్నాం..ధర్మదీక్ష!!!

కామంలో దారితప్పితే సద్యః కాల్చివేతలా?
అర్థంలో దారి తప్పితే మాత్రం అభినందనలా?
అధికారవజ్రపంజరంలోనికి ఆహ్వానగీతికలా?
వాడిని కాల్చిన తుపాకీగుండు
వీడిదగ్గర అసలు బయటకు రాదేమిటి?
ట్రిగ్గర్ నొక్కటానికి వ్రేలు వెనక్కు వాలదేమిటి?
అందరమూ ఆ తాను ముక్కలమేనని కొంకా?..జంకా?

68

నేను నమ్మిన పరమాత్మ రసస్వరూపుడు
ఇక నా పద్యాల్లో రస మెందుకు?
నేను నమ్మిన దేవుడు సత్యస్వరూపుడు
అంతటివాణ్ణి నా మాటల్లోకి లాగటమెందుకు?
నేను భావించే బ్రతుకు ధర్మప్రమాణం
మరి నా చేతల్లో ధర్మాన్ని బంధించట మెందుకు?
అందుకే నేను స్వ+ఇచ్ఛాజీవిని..

అందరూ స్వేచ్ఛాజీవులే ఎవరి హద్దుల్లో వాళ్ళు
అందరూ సత్యస్వరూపులే ఎవరి మాటల్లో వాళ్ళు
అందరూ ధర్మస్వరూపులే ఎవరి లెక్కల్లో వాళ్ళు
అందరూ తమకోసమే బ్రతుకుతారు ఎవరి మానాన వాళ్ళు
అయినా మనకు సలుపుడు ఎందుకంటే
అందరూ ఎదుగుతూ ఉంటే చూడటం కష్టం గదా
అందరినీ హాయిగా భరించటం ఆత్మహత్యాసదృశం గదా!

69

ప్రపంచం కళ్ళు మూసుకుంది.. ఇప్పుడు దానికేవీ పట్టవు
మాయావాదమైనా జాయాజూదమైనా దానికొక్కటే
నువ్వు నవ్వినా ఏడ్చినా దానికి కనిపించదు
నువ్వు బొంకినా కొంకినా అది పట్టించుకోదు
కొండలైనా లోయలైనా దానికి తేడాయే తెలియదు
మద్యమైనా మకరందమైనా దానికి సమమమకారమే
తనను తాను కొలుచుకుంటూ అది తలమునకలై ఉంది

బల్లపరుపుగా ఉన్నావంటే కొలబద్దలు తెచ్చుకుంది
గుండ్రంగా అనేసరికి పురికోసలు తెచ్చుకుంది
అంతా నువ్వే అన్నారని అందరినీ అదిలిస్తోంది
తిరుగుతూనే ఉంటావంటే వెర్టిగో అని భయపడుతోంది
మూడుకాళ్ళ జంతువులు నాలుగు చేతుల మనుష్యులూ
ఏమయ్యారో తెలీక ఇరుకున పడి దిగాలు పడుతోంది
తానే ఇలా ఉంటే...మనకు తలతిరుగుడు తప్ప మరే ముంటుంది?

70

ఏ కళ్యాణానికి వెళ్ళినా నేను వెతికేదొక్కటే
సన్నంచు పంచలు కనబడకపోతాయా అని
అదేం వగలో అవేం వైభవాలో తెలీదు కానీ
మగాళ్ళ పంచలూ చీరలతో పోటీ పడుతున్నాయి
జరీ అంచులూ, పట్టంచులూ, సెమీపట్టూ,
ఇమిటేషన్ పట్టూ, బెత్తెడు జానలు చారలూ...
కాళ్ళకు అడ్డం పడుతున్నా లాగి లాగి కట్టుకుంటూ..

తల నెరిసిన వారూ ముడిచిన తలలు గలవారూ
పండితులూ పామరులూ పురోహితులూ తిరోగతులూ
ఆ మతమూ ఈ మతమూ రామరాజులూ రాజారాములు
రెండువేదాలూ మూడువేదాలూ నాలుగు వేదాలూ
విడివిడిగా ఆ వేదాలూ ఈ వేదాలూ ఎటుచూసినా సరే
పరమాత్మవిషయంలో తేడాలే గానీ
పంచె డాబు అంచుల్లో అందరూ పోటీపడేవాళ్ళే......

71

ఒకడు ఆజానుబాహువు.. అదృష్టవంతుడు
గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకుంటాడు
చేతులు పొడుగు గదా! అందరికన్న ముందు తానే....
ఒకడు మరుగుజ్జు మరీ అదృష్టవంతుడు
పాడుపనులు చేసి పరుగెత్తుతుంటాడు
పొట్టివాడు గదా..ఎవ్వరికీ తేలికగా అందడు...
అమ్మ..హమ్మ.. ఏమిటీ నిర్మాణవైచిత్ర్యం?

పోనీ మట్టసంగా ఉండేవాడే మంచివాడందామా?
వాడు అటూ ఇటూ కూడా తప్పించుకుంటున్నాడు
నొప్పింపక తానొవ్వక.....
ఇది మరీ మరీ మతలబీకృతవ్యవహారం కదూ!
అందుకేనేమో...ఆలోచిద్దాం అందరం
గుమ్మడికాయల జోలికి వెళ్ళకుండా ఉందాం
ఎవ్వరికీ పేచీ లేదు..కానీ బుద్దే..మాట విని చావదు...

72

ఆమె నవ్వింది ..కాదు నవ్వుకొంది
నిన్ను చూసీ కాదు నన్ను చూసీ కాదు
మనలో రూపుదిద్దుకొన్న వెగటుదనాన్ని గురించి
ఆమెకు కిరీటం పెడుతున్నామనుకుంటూ
మన కోటరీలు వేసే కుప్పిగంతుల గురించి
సముద్రాన్ని పిల్లకాలువలోకి లాగి
పిప్పరమెంట్లు కడుక్కుని తినే చాపలాన్ని గురించి...

నాలుకల మీద బీజాక్షరాలంటూ నలుగురినీ వంచించి
అందినకాడికి దోచుకుంటూ కూడా అలమటింతలా?
ఛందస్సులో చాకు వత్తో దాకు వత్తో తెలీదు కానీ
ఛందస్స్వరూపిణితో ఎకసెక్కాలా?
తూర్పారబడితే తాలులా తేలిపోయే వాళ్ళకు
అడుగుగింజ కదిలిస్తే పైనుండీ కుప్పకూలేవాళ్ళకు
సర్కస్ డేరాలో రింగ్ మాస్టర్‌లా కేకలూ, అరుపులూనా..?

73

వరదలను బారికేడ్లు ఆపలేవు
కారిడార్లు పరీవాహప్రదేశాలు కాలేవు
ముక్కు మూసినా తెరచినా మూడే మునకలు...
ఈత వచ్చినా రాకపోయినా
జలాల ఉపరితలాలే సమాధిసోపానాలు
ధర్మశాస్త్రాలూ తెలిసినట్టు మనలా నటించ వవి
వాటమే గానీ చాటుమాటులు తెలియవు వాటికి

బొండుమల్లెలూ గండుపిల్లులూ
రెండూ ఉరకలెత్తే వరదపరువులోనే
గరికలూ వాటిమాటు గిరికలూ
రెండూ తలక్రిందులుగా ఉరవడిఅలజడిలోనే
వగపంచే చివుళ్ళూ పగ పెంచే చిదుగులూ
రెండూ ఆ కరళ్ళ ఉక్కపోతల్లోనే
నువ్వా?...అడుగు బురదలోనా? పైన వరదలోనా?

74

నాకూ ప్రేమ కావాలి
ప్రపంచం పట్టనంత..
కానీ నా హృదయం సంకుచితం
పరమాణువూ పట్టనంత..
నీ ప్రేమతో నా హృదయం
చెట్టంతగా పరచుకొని
ప్రపంచానికి నీడ నిస్తుంటే.....

మంటినుండీ మింటిదాకా
విశ్వమంతా రసమయమూర్తియై
ప్రేమలు పల్లవించిన చోటులు
విశ్వాసవియత్తలంలో విరిసిన వేదికలై
కలిసిన అడుగులూ కలతపడని చూపులూ
పలుకరించే కాలం ప్రసవించిన పోలికలై
విశ్వప్రేమగీతికలై వలపుతొలకరిని కురిపిస్తుంటే.....

75

అనాథాశ్రమానికి చందా అడిగితే
అప్పటి కప్పుడే బొమ్మను వారితో పంపిస్తాడు
అన్నదానానికి చందా అడిగితే
అన్నదమ్ములతో సహా ప్రొద్దుటే వెళ్ళి కూర్చుంటాడు
పరివారసమేతంగా అని మాటవరసకంటే
పనివాళ్ళతో కలిసి పెళ్ళికి బయలుదేరుతాడు
వాడితో పెట్టుకోవద్దు...ఏదైనా వాడు వాటంగా వాడేస్తాడు

పాదరసాన్నీ రెండు వ్రేళ్ళతో పట్టగలవాడు వాడు
కాలిముల్లునూ కళ్ళకద్దుకొని దాచుకొనేవాడు వాడు
పరువూ మర్యాదా అని మన మనుకోవటమే కానీ
కూలి గిట్టితే నాలికైనా సిద్ధమైనవాడు వాడు..
నాయికల ఉపాలంభనాలు విని సిగ్గుపడబట్టే గదా
చంద్రుడు టిబీయో ఒబేసిటీయో తేలకుండా బ్రతికేది
చేయి చాపే ఉంచుదాం.ఏదైనా రానీ..వదులుకోవట మెందుకు?

76

నిప్పు లోహం చక్రం కత్తి కళ్ళెం నాగలి...
నాగరికత పుట్టుకలో ఇవన్నీ తొలకరిచినుకులు
కానీ ఏ బిందువైనా మనిషిని కలవరపెట్టిందా?
కంప్యూటర్‌ను ఆవిష్కరించుకున్నాం
బ్రతుకునంతా దానికి బదిలీ చేసి సాక్షులమై చూస్తున్నాం
మన రెప్పపాటులోనూ మన ప్రమేయం లేకుండాపోతోంది
అదే వాలుతోంది..నిమిషానికి ఒకసారి కాదు..వందలసార్లు

వరదలై ప్రవహించీ వట్టిపోయిన నదులనూ
కథలుగా ప్రభవించి కలతలైన బ్రతుకులనూ
చూసి క్షోభిస్తున్న హృదయాల సంవేదన మిది...
నాగరిక ఆవిష్కరణలన్నీ శరీరంతోనే మంతనాలాడాయి
కానీ..కానీ...కానీ....ఇది మనస్సును చుట్టేసింది
మనలనే ..మన మనసులనే మనకు కాకుండా చేస్తోంది
అయితే వరం..వైపు తప్పితే శాపం..అందుకే భయం..

77

పులిపిల్లలో ఎంత అందం!
అయినా పెంచుకోవాలని ముచ్చటపడం
ఏనుగుగున్నలో ఎంత ఠీవి!
అయినా ఇంటికి తెచ్చుకుందామని అనుకోం
ఒక్క ఎలుక చాలు..మనం జాగరణం చేయటానికి
ఒక్క క్రిమి చాలు..బ్రతుకు మూణ్ణాళ్ళలో ముగియడానికి
అయినా ధైర్యంతో ఇన్నాళ్ళూ బ్రతుకుతూనే ఉన్నాం

ఇప్పుడు సాంకేతికసౌభాగ్యంతో జూదమాడుతున్నాం
ఉన్నతశిఖరదర్శనమో? పాతాళతలస్పర్శనమో?...
ప్రతి ఇద్దరిమధ్యా ఈ-పరదాలు .. అదృశ్యయవనికలు
ఇంత ప్రపంచానికీ అరచేయి మాత్రపు మూత
అలవాట్లన్నీ తారు మారు.. అందరూ ఎవరిమట్టుకే వారు
"చీకటిలోపల నా గదిలో, నా గదిలోపల చీకటిలో"
మహాకవీ! ఇప్పుడొప్పుకుంటున్నా...నువ్వు క్రాంతదర్శివి...

78

గుర్తింపు కావాలంటే రెండే దారులు
చెలామణిలో అయినా ఉండాలి
పాతబడి అయినా పోవాలి
కొత్తనోటుపైనా పాతనాణెంపైనా
చిన్నా పెద్దా అందరికీ ప్రేమే
చదునుగా లేకపోయినా
బండలతో కడితేనే గోడకు అందం

పలకరింపులో తాజాదన మైనా ఉండాలి
రాచ్చిప్పలో పచ్చిపులుసునైనా వండాలి
తేనెలో నానిన ఉసిరికాయలు తినటం కాదు
తేనెపూసిన కత్తిలానే తిరిపానికైనా వెళ్ళాలి
ఆస్థానవిదూషకుడిగానైనా
ఆటలో అరటిపండుగానైనా
కొలువులోనే ఉండాలి కుళ్ళుకుంటూ అయినా

79

అద్దాలతో గొడవపెట్టుకొని
ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు
ఆత్మార్పణల దాకా వెళ్ళకూడదు
అనునిత్యం ఆయుష్షు పెంచే అమృతగుళిక లవి
ఆత్మన్యూనతతో అలమటించేవారికి
ఆత్మరతిని నేర్పే తొలి విశ్వగురువు లవి
పాదరసం పట్టుతో ప్రపంచాన్ని ఊపగలవవి

సానుకూలదృక్పథాన్ని సడలించుకోలేనివవి
అందంగా లేని ముఖాలను
అసలింతవరకూ చూడనేలేదవి
రాబోయే నవసాంకేతికయుగాలలో కూడా
పసలేని బింబాలను ప్రతిబింబించబోవవి
పైనే చూస్తున్నట్టు పైపైకి అనిపిస్తున్నా
మనస్సులనూ బంధించి మనముందు పెట్టేవి అవి

80

ఈ తీరంతో విసుగెత్తిపోయింది
ఈ నీలినీలి కడలికి ఆవల వున్న తీరంలో
ఆరబోతలై ఉన్న అందాలను చూడాలి
వాటితో పెనవేసుకున్న ఆనందాలను రుచిచూడాలి
అక్కడ ఆ తీరంలో పొడిబారని ఇసుకలో నిలిచి
తీరాల మధ్య ఇరుక్కొని గిలగిలమంటున్న జలధిని
ఈ తీరం అంచుల దాకా చూపు సారించి చూడాలి

మనకే భవసాగరాలని భంగపడుతుంటాం కానీ
అసలు భంగాలూ భంగపాట్లూ సాగరానివే..
ఒకసారి భూమిని చుట్టి మీదపడేశా డొకడు
సేతువు కట్టనీక పోతే తుంపురులు చేసేస్తానని ఒకడు
ఒకసారి వాళ్ళూ వీళ్ళూ కలిసి మథించి మట్టి కరిపించారు
అయినా అది స్తబ్ధమూ కాదు లుబ్ధమూ కాదు
విసువు విరామం లేని అంతశ్చలనం దాని జీవలక్ష్యం..

81

అనాదిగా బ్రతుకుతూనే ఉన్నాం
కొండల్లా కోనల్లా పారుతున్న ఏరుల్లా
కసవు తినే పశువుల్లా కలలు లేని శిశువుల్లా
గ్రుడ్డెద్దుల గానుగల్లా దున్నగలిగే దున్నల్లా
మంటల్లా పంటల్లా మనసెరిగిన జంటల్లా
తిరుగుతూనే ఉన్నాం లోపల్లోపలే..ఎక్కడికక్కడే
భూమిలా మనమూ గుండ్రంగానే ఉభయతిరుగుళ్ళతో..

నిటారుగా ఉన్నాం మనం
అడ్డంగా తిరిగేవాటి కన్నా గొప్ప అనుకున్నాం
ఋజుగతికి తిర్యగ్గతితో పోలికా?...
అవన్నీ సభపెట్టి తీర్మానం చేశాయి చూడండి
'రెండు కాళ్ళ రెండు నోళ్ళ వాళ్ళతో...
ఆకలితీరినా ఆబగా బ్రతికే వాళ్ళతో ..వికృతులతో..
ప్రకృతితంత్రాన్నే పాటించే మనకు పోలికేమిటి?'

82

కళ్ళు తెరిస్తే కిరణాలు రెప్ప వాలితే వెన్నెలలు
పగటి ఎండకు చెట్లు రేయి సేదకు గట్లు
ఆకలికి కాయలూ దుంపలూ
ఆరోగ్యానికి ఓషధులూ మూలికలూ
ప్రతిఋతువుకూ జతగా అతికే పూలవల్లరులు
ప్రకృతిని గౌరవించే పరిసరాల విరిసరాలు
సృష్టికి సాగిలపడే గగనాలూ నేలకులుకులూ...

కొండలూ లోయలూ కలిసి కూర్చిన ఆత్మవిశ్వాసంగా
అందాల అమరికలతో అర్పించిన ధైర్యంగా
నారుపోసిన వాడు ప్రేమగా పోసిన నీరుగా
తమిని కూర్చినవాడు చక్కగా తీర్చిన దారిగా....
ఇంకా ఏం లోటైందని ఈ లోకాలూ ఆ లోకాలూ
పాలలో ఏముంది లోపం?..ఉన్నదంతా పాత్రలోనే
తొలకరి పలుకరించినా ఏం లాభం?..గింజ పుచ్చిపోయింది

83

నీకు తెలుసో తెలియదో
నీకూ తెలియదు నాకూ తెలియదు
నాకు తెలుసో తెలియదో
నాకూ తెలియదు నీకూ తెలియదు
అయినా ఇద్దరమూ
తెలిసినట్టే మాటాడుకుంటామే...అదే
జీవితనౌకను నడిపే చె(తె)రచాప అంద మంటే..

ఎప్పుడో మొలిచిన గింజలు
ఇప్పటికీ మారాకు తొడగలేదు
ఎప్పుడో పుట్టిన జాతికి
ఇప్పటికీ తప్పటడుల్లోనూ తడబాటు
చుట్టి చూస్తే పూతరేకే గానీ విప్పి చూస్తే మేడిపండు..
విషాదంగా ఏదోలా నడుస్తోందనటమే కానీ
విశ్రాంతిగా ఆనందంగా గడుస్తోందని ఒక్కడూ అనడే!!!

84

అంపంలాగా ఊగిసలాడదు
కత్తిలాగా పక్షపాతీ గాదు
సూదిలాగా చొచ్చుకొనీ పోదు
బరమాలా రంధ్రాన్వేషణకు పూనుకోదు
బాడిసలా చెక్కుచెదరగొట్టదు
బాణంలా అలిసి అటువైపు చేరి పడదు
ఇరుపక్షాలనూ సమంగానే ఉత్తరిస్తుంది..కత్తెర

కలిసి పనిచేయటాన్నీ కళ్ళకు కట్టిస్తుంది
కలిసి విశ్రమించటాన్నీ కనువిందు చేస్తుంది
రెండు వ్రేళ్ళకూ సమంగా కదలటం నేర్పిస్తుంది...
అయినా కత్తెరకు అగచాట్లే
బలవంతంగా అంటగట్టిన బ్రతుకుపాట్లే...
ఏ పాటి వీలు దొరికినా విడిపోకకే ప్రయత్నిస్తుంది
అవును మరి..మన చేయి.. మనిషి చేయి తగిలిందిగా...

85

ఒకడు ఖరహరప్రియ ఆలపించినా
ఒకడు శంకరాభరణంలో కాకలు తీర్చినా
ఒకడు కళ్యాణరాగాన్నే మోహనంగా పాడినా
ఒకడు అభేరితో దడదడలాడించినా
ఒకడు శుద్ధసావేరితో కరుణరస మొలికించినా
ఒకడు తిల్లానాలో కదనకుతూహలాన్ని ప్రకటించినా
బృంద గాన మెప్పుడూ 'అర'చేతులు కలిసిన చప్పట్లే..

ఆత్మస్తుతిపర్వాలు అందరికీ నచ్చకపోవచ్చు
పోనీ...మనమెందుకు మానాలి?
మన డబ్బా కొట్టుకోడానికే మనకు సమయం చాలదే
మరి అందరి డబ్బాలూ ఎక్కడ కొడతాం?
'భగవానువాచ' మనకు ఆదర్శం కాలేదా?
మన ప్రతిభ పూర్తిగా తెలిసేది మనకు మాత్రమే...కదా!
"తెలివితక్కువతనం కూడా అంతే..అందుకే జంకు"...

86

ఏ చాటూ మాటూ లేకుండా
అసలు ఆ ఆలోచనే రాకుండా
జంతువుల్లాగే తిరిగాం జంతువులతో కలిసి
ఏ రోజు ఏ ఆలోచన మొదలైందో కానీ .
చాటు మాటు లోని అభిమానం తెలిసింది
బ్రతుకు కళాఖండ మైంది .. భావన కవితానంద మైంది
ప్రపంచం ఒక్కటైంది .. కానీ... ఎవరిహద్దుల్లో వాళ్ళం

ఇప్పుడు నేను అందరివాణ్ణి
నాకూ నేను మిగలనంతగా
అక్షాంశరేఖాంశాలతో సహా
అందరి చూపులకు అందుతున్నవాణ్ణి
నా గుండెకోతను నాకే తెలీకుండా
క్షణాల్లో పూర్తిచేసే రోజు వచ్చింది... అయితే
అదే సమాజానికీ గుండెకోత అవుతోందే..మందు లేకుండా

87

కాయ పండి రాలేదాకా బరువుగానే ఉంటుంది
తొడిమకైనా తరువుకైనా పుడమికైనా
రాలీ రాలగానే అన్నరసమయమై
అతిథు లందరికీ ఆరగింపు చేస్తూ
చెట్టు ఋణం తీర్చుకుంటుంది
తొడిమా గింజుకోదు పుడమీ రుంజుకోదు
అది తరుధర్మం ఫలధర్మం ఆశ్రయధర్మం

ఆ పండ్లు.. క్షమించాలి.. ఫ్రూట్స్ తింటున్నామా!
ఆ గుణాల్లో ఒక్కటైనా అబ్బవద్దూ?
వాడూ వీడూ కలిసి ఉంటే ఏడుపు
వీడూ వాడూ విడిసి ఉన్నా ఏడుపు
వీడూ వాడూ ఎదురై తాడో పేడో తేల్చుకున్నా ఏడుపు
గుండెల్లో ప్రేమ ఉంటే ముఖంపై కనిపించాలి వెన్నెల్లా
ముఖం మీద గంట్లేనా ఎప్పుడూ...మాడిపోయిన రొట్టెల్లా?

88

నేనంటే నీకెంత ప్రేమో నాకు తెలుసు
ఏ కార్యం తలపెట్టినా నా చేతే నాంది పలికిస్తావు
అరిటాకులు అరటిపండ్లు అరటికంబాలు
తమలపాకులు మామిడాకులు ములక్కాడలు
నీ ఇంటికే తెచ్చి అందించే అవకాశం నాకే ఇస్తుంటావు
మా తోటలమ్ముకొని తరాలు గడచిపోయినా...
మరీ ముచ్చటేసే విషయం మరోటుంది తెల్సా

కావాలని తేవాలనీ ఎప్పుడూ అడగవు
కళాత్మకంగా నాకు తెలిసేలా చేస్తావు..అంతే
ప్రక్కక్షణం నుండీ ఎదురు చూస్తూ నిలుచుంటావు
ఆలస్యమైనా ఏమీ అనవు...అర దరహాసంతో
అన్ని తిట్లు ముందే తిట్టి నా చెవినిబడేలా చేస్తావు..
వస్తువులు దించీ దించకముందే 'జాగ్రత్తగా వెళ్ళిరా' అంటావే
అక్కడ కనిపిస్తుంది బ్రతకనేర్చిన జాణతనం... పెద్దరికం

89

నిలబడి నవ్వులు
కూలబడి నవ్వులు
ఇకిలింతలు సకిలింతలతో
పగలబడి నవ్వులు
మనమే నవ్వుల పాలైన రోజు
ప్రక్కవాడు నవ్వడానికైనా మిగలని
ఉసిముసిముసికసినుసినవ్వులు

చెలమల్లోని ఊటలా మజ్జిగమీది తేటలా
చషకానికి సరిపడా ఊరినా చాలు హాస్యం
గొంతు మీదుగా గుండెల్లోకి ప్రాకినా చాలు
పులకరించిన మనస్సు హాయిగా పల్లవిస్తుంది
రాముడినీ కృష్ణుడినీ నవ్వులపాలు చేస్తూ
సిట్టింగ్ కామెడీలు చేస్తే మాత్రం
తేది ముగిసిన మందులా వికటిస్తుంది..

90

మంచుపొరలు కప్పిన మాణిక్యదీపాలనూ
రాతి రాసిక్యాలను వెలార్చే శిల్పమయాలయాలనూ
తరంగాలనూ కురంగాలనూ సారంగాలనూ
ఆకుల ఆకులపాటునూ తీవెల కత్తెరకళాఖండాలనూ
కోటలనూ తోటలనూ ఇసుకమేటలనూ బాటలనూ
కోటకూ నీటికీ మధ్య పరుచుకున్న బురుజులనూ
దిదృక్షతో సేవిస్తున్నామే..దినవెచ్చాలకు కరువుగా ఉన్నా...

ఏ బంధమూ లేనివాటికై ఎందు కలా పరుగులు
అందాలకో ఆనందాలకో దాసోహమవుదా మనేగా
సత్యానికీ సత్యానికీ సంధానకర్తల మవుదా మనేగా
ప్రతి అణువులోని ధర్మాన్నీ పురస్కరించా లనేగా
అంతకన్నా తక్కువ ఏముంది ఉదయాస్తమయాల మధ్య?
అంతకన్నా ఏం తక్కువైంది జననమరణాల మధ్య?
పుణ్యభూమి అంటూనే పలాయనా లెందుకు?

91

అంతరంగంలో కొలువైనవాడు
ఆశీర్వదించగలడేమో కానీ
ఆర్తి తొలగాలంటే అటో ఇటో
ఆత్మీయు లుండవలసిందే
కండబలం గుండెబలం
చెరో వైపు నిలువవలసిందే
మనస్సునో ఆత్మనో నమ్ముకుంటే చాలదు

అవి మోసంచేస్తాయి మనుషుల్లాగానే
ముఖం చాటేస్తాయి మనం పిలిచేలోగానే...
ఎదురెదురు ఇళ్ళలో నివాస ముంటూ
అంతర్జాలముఖంగా జన్మదినశుభాకాంక్షలూ
కూతవేటు దూరంలో కూరగాయలు దొరుకుతుంటే
పెద్దబుట్టలో పట్టి తెప్పించుకోవడాలూ
తినడానికి సరిపోవచ్చు కానీ మనడానికి సహకరించవు

92

అందగత్తె లంటూనో అందగాళ్ళంటూనో
వారికో వీరికో కిరీటం పెట్టటమే కానీ
అందం లేనివాళ్ళెవరు? ఎక్కడుంటారు?...చెప్పండి ?
ఎంత దూర మైనా సరే వెళ్ళి దర్శనం చేసుకుంటా
శూన్యంతో ప్రారంభించి పూర్ణంలో దాకా
అడవిలో వెన్నెలంత అందం పరుచుకొని కాస్తుంటే..
అక్కడో సిరి ఇక్కడో చుక్కా పెట్టి అదే అంద మంటే ఎలా?

తళుకులీనుతూ జారుతున్న తుషారకణంలో
వెలుగులూదుతూ కరుగుతున్న కర్పూరకళికలో
కాయ బ్రద్దలై ఎగురుతున్న జిల్లెడు గింజల్లో
అలకూ అలకూ మధ్య ఎగురుతున్న
ఆల్చిప్పల జీవనపోరాటంలో... పీతల బొరియల్లో
సరీసృపాల వంటి బాటల అంచులలో
సత్యసౌందర్యం సాక్షిసంతకం చేస్తున్నా పట్టించుకోమా?

93

శ్రమను ధనంతో విలువగట్టి దిగజారిపోయాడు మనిషి
ప్రకృతిపై అలనాటి తొలి విజయం
విషాదాంతకావ్యమై నేటికీ పరిహసిస్తోంది జాతిని
కోలుకోక ముందే మరో విషాదాంతకావ్యానికి
కృత్రిమమేధ క్రూరంగా శ్రీకారం చుడుతోంది..
ఒకప్పుడు మనకూ తోక ఉండేదట
వాడకం లేదు కదా అని ఊడిపోయిందట

ఇప్పటికే ఇళ్ళలో అడ్డంగా పడుకోవటమే కానీ
నిటారుగా కూర్చోవటం నిలిపివేశాం
కృత్రిమమేధ ఉరువడిలో
అసలు మేధనూ వాడటం ఆపేస్తా మేమో!..
జీవన్మృతులకూ మృతజీవులకూ
తేడా తెలియని స్థితి జాతికి సంక్రమిస్తుందేమో!
నాకైతే ఫరవాలేదు.. నేను కాకిలా చిరంజీవిని

94

నేను మితభాషిని..
అందుకే నచ్చా నంటావ్
నేను యశోభిలాషిని..
అందుకే దగ్గర కొచ్చా నంటావ్
నేను బహుకృతవేషుణ్ణి..
నాకదే ఇష్టమంటావ్
నా మనస్సునే పట్టి నొక్కుతావ్

నీకు నచ్చిన అన్ని గుణాలూ
నాలో ఉన్నాయంటావ్
అందుకే ప్రేమించానంటావ్
నీ కనుపాపల భావాలు
నేనొక్కడినే చదవగలనంటావ్
అందుకే మనస్సు నిచ్చానంటావ్

ఇంతకూ నీకు నచ్చింది నేనా? నువ్వా?

95

ఆకలి అన్వేషణ నేర్పింది
స్పర్ధ పరుగుపెట్టడం నేర్పింది
భయం పారిపోవటం నేర్పింది
సిగ్గు కుంచించుకుపోవటం నేర్పింది
ధైర్యం కొండెక్కటం నేర్పింది
అత్యాశ అన్నింటినీ చేజార్చుకోవటం
చెప్తూనే...చెప్తూనే ...ఉంది

నిప్పు నిజాయితీని నేర్పి ఉంటే
కలత కలిసి ఉండటాన్ని నేర్పి ఉంటే
మగత జాగరూకతను నేర్పి ఉంటే
మమత విశ్వవ్యాప్తిని మరిగి ఉంటే
నువ్వూ నేనూ కవిత్వాలు వ్రాసుకుంటూ
కలవరపడుతూ కథలు చెప్పుకొనే వాళ్ళమా?
సణుగుళ్ళమై నిరంతరమూ సతాయించేవాళ్ళమా?

96

పంక్తికి ఇరవైయారు అక్షరాలే అయినా
ఛందస్సుల సంఖ్య పదిమూడూ కోట్లా చిల్లర
చదరంగం గడులు అరవైనాలుగే అయినా
గింజల మొత్తం రాజ్యాన్నే ధారబోయవలసినంత
తత్త్వాలు స్థూలంగా మూడే...పోనీ నాలుగు
కానీ నానోగా చూస్తే స్వభావాలు అనంతానంతాలు..
ఉండనీ ...రాబోయేతరాల వారు దిగాలు పడకుండా...

ఇక పొందికలకు అందిక లెలా కుదురతాయి?
ప్రతి ప్రాణీ ఒక మౌలికధర్మియే
ధర్మల మధ్య ఘర్షణను తప్పించేదెలా?
ఇసుకరేణువుల్లా పడిఉండటానికి
మనమేమీ జీవనం దగ్గర లేము...జీవనమే మనం..
అందుకే..ఎంత సన్నిహితులైనా ఏ ఇద్దరూ ఒకటికాదు
ఆదర్శకుటుంబాల్లోనూ అందరూ ఒకేలా కాదు....

97

అడగడం చేతనయ్యే దాకా
ఆకలెరిగి అన్నం పెడతాం
నడవడం చేతనయ్యే దాకా
భుజాని కెత్తుకొని మనమే నడుస్తాం
తినడం చేతనయ్యే దాకా
గోటిముద్దలు పెట్టి పెంచుతాం
అన్నీ నేర్చుకున్నాక?....

ఏదీ అడగటమే లేదంటూ ఆక్రోశిస్తాం
చెప్పకుండా తిరుగుతున్నాడని కలతపడతాం
మన రుచులను మెచ్చడం లేదని చిరాకుపడతాం
తన బ్రతుకు తాను బ్రతికినా అదోలా చూస్తాం
మన కారకత్వాన్ని చెప్పటం లేదని మందలించబోతాం
అప్పుడు మనం తప్పు చేశామా? ...
ఇప్పుడు వాళ్ళు తప్పు చేస్తున్నారా?....

98

ఉలిక్కి పడటం అలవాటైతే
ఎన్నెన్ని మాటలూ మనకు సరిపోవు
గాలి వీచినా ధూళి లేచినా
వెలుగు ప్రసరించినా జిలుగు ప్రసవించినా
అఆలు దిద్దుకుంటున్నా
ఎక్కాలు చదువుకుంటున్నా
మనం ఉలిక్కిపడుతూనే ఉంటాం

అందరినీ మనలో చూసుకుంటే అదొక అద్భుతం
కానీ అందరిలోనూ మనలనే చూస్తామే మనం
మనలను చూసే నవ్వులని యాష్టపోతూనే ఉంటాం
మన అపరాధభావనను అందరికీ అద్ది ఆనందిస్తామే!
పరుల మనస్సు వెన్నయినా సరే
గసి కోసమే కరిగించి ఆరగిస్తే గానీ మన కుతి తీరదే!
ఇక ఉలికిపాటు తప్ప మన బ్రతుక్కు మరేముంటుంది?

99

పుల్లా పుడకల కాకి గూటిని కూల్చి
పుల్లలతో శనక్కాయలో చిక్కుళ్ళో కాల్చుకుంటాం
తేనెటీగ కష్టమంతా మధువుగా మారితే
పొగపెట్టి తరిమి తేనెతో ఆరోగ్యసూత్రాలు వ్రాసుకుంటాం
పట్టుపురుగులను పట్టుపట్టి చంపి కూడబెట్టిన పట్టుతో
మడిగా మంత్రాలు చదువుకొని పుణ్యలోకాలకు పోతాం
చేసే ఘనత చెప్పకున్నా ఫలిస్తూనే ఉంటుంది....

అన్నింటికీ ప్రతినిధులనుగా
చెదపురుగులను సృష్టించుకున్నా యవి
నువ్వెంతటివాడివైనా వాటికి లెక్కే లేదు
చూడ్డానికి జీలకర్ర అంతే ఉంటాయ్
పగబడితే మాత్రం ఏనుగుల్లా తింటాయ్
వేయి దున్నలను తిన్న రాబందు అయినా
ఒక్క గాలివానతో సరి..కాదనగలమా?.. అని మనగలమా?

100

నిప్పును ఆర్పగల మేమో కానీ
వెచ్చదనాన్ని ఆపలేము మనమే చల్లబడితే తప్ప
పూలరేకును మెలిబెట్టి నలిపినా
పరిమళాన్నే పంచుతుం దది పదిదిక్కులకూ..పక్కా
దుమ్మే కదా అని కాలితో రేగగొడితే
నెత్తి మీదికే ఎక్కుతుం దది...అంతే దాని లెక్క
ప్రకృతితో ప్రమాదం...ప్రక్కటెముకలనూ విరిచేస్తుంది

తోట కుసుమించకపోయినా
బాట పరిమళించకపోయినా
పరువెత్తి చూడు....ప్రాణాలు పోయినా ఫరవాలేదు
మనలోని ఏ మకిలి ప్రకృతికీ అంటుకొని
పరిమళాలపై ప్రభావం చూపిందో గమనించు..
నువ్వు స్తబ్ధంగా ఉండవచ్చు..నేనూ స్తబ్ధంగా ఉండవచ్చు
ప్రకృతిశాసనం మాత్రం నిత్యచైతన్యపురోగతియే...

101

ఏ దాపరికమూ లేదు...దశదిక్కుల్లోనూ
హద్దురాళ్ళూ లేవు..చుట్టు గోడలూ లేవు
ఆనందంతో ఉప్పొంగినా ఆక్రోశంతో ఎగిసిపడినా
తనలోనే.. తన అలలు తాకిన చారికల చీరికలలోనే..
మనమే తెగించి ప్రహరీగోడలు కట్టేస్తే
అమ్మో!!! లోపలినుండీ వినిపించే ఘోష భరించటమే!!!
నింగి నంటే తుంపరలలో నిలువెల్లా తడిసిపోమూ?..

ఎప్పుడైనా చిర్రెత్తితేనే..
ముందూ వెనుకా చూడకుండా ముంచెత్తే దది
అటూ ఇటూ చూడకుండా పరుచుకుంటూ ప్రవహించేది
సునామీలంటూ మనం భయపడటమే కానీ
మన బినామీలకంటే అవేం భయంకరాలా?
ప్రమాదకరాలా? ప్రాణాంతకాలా?
ఒక్కొక్క బినామీ వేల సునామీల పెట్టు....

102

అతడు శునకపాత్ర వేశాడు వేదిక మీద
నటించడం మాని జీవించాడు
వేదిక దిగినా అదే పాట "భౌ భౌ లౌ లౌ"
హితులంతా చెప్పి చూశారు..వినడే
తనువు మీద తట్టి చెప్పారు..అరవటం మానడే
తప్ప లేదు..పిచ్చి అని ముద్ర వేశారు
తలా ఒక రాయి విసిరి తాత్పర్యం తెలియజేశారు

అధికారం కూడా వేదికమీద పాత్రే
అప్పటికి నటించాలి.. జీవిస్తే ప్రమాదం
అధికారాంతమునందు..పిచ్చికుక్క బ్రతుకు కాకూడదు
మనకు రాళ్ళ దాకా అవసరం లేదు..మాటలు చాలు
దగ్గరకు వచ్చిన మనుషులు
తోకలూపుతున్నారో లేదో చూడకూడదు..
ఊపినా అది ఆ తోకలక్షణమే..మన ఘనత కాదు...

103

ఆత్మజ్ఞానం అఆలు దిద్దుతున్నప్పుడు
అహం మొహం మీదే
ఆనందతాండవం చేస్తున్నప్పుడు
ఈ లోకమంతా తనదే అనిపిస్తుంది
చెట్టూ చేమా పుట్టా గట్టూ
తన కంటికోసమో తన ఇంటికోసమో
నవనవలాడుతూ ఉన్నట్టనిపిస్తుంది

ఒక్క ఎకరం నెర్రెలు వారినా
తన పొగరుకు నాట్లు పడనట్టే భయం
ఒక్క నది ఇసుకలోనే ఇంకిపోయినా
తన అహంకారం మరకబారినట్టే కలవరం
అటువంటివి చెప్పకండి..పాపం..భరించటం కష్టం
పచ్చగా ఉన్నదంతా తన గొప్పతనమట
చెడిపోయింది మాత్రం విధివిలాస మట

104

నీ ఓటు నేను అడగను
నీ మద్దతు నేను కోరను
నీ ప్రచారం నేను ఆశించను
నీ చందా నేను ముట్టుకోను
నేను అడిగేది ఒక్కటే ఒక్కటి
నువ్వు నన్ను నమ్ము ..
మిగిలినదంతా నే చూచుకుంటా

నమ్మించాను గదా నాయకుణ్ణయ్యా
నమ్మడానికీ మితి ఉంటుంది నువ్వు దాన్ని దాటావ్
ఒప్పుకున్నావు గదా ఓపికతో చూస్తుండు
ఎన్నుకున్నావు గదా ఏడవకుండా కూచో
కళ్ళూ నీవే కాళ్ళూ నీవే కదలకుండా ఉండు
ఓట్లూ నీవే పాట్లూ నీవే ..
నువ్వు ఓపిగ్గా బ్రతుకు.. నేను ఉన్నదంతా దోచుకుంటా

105

నేను మొదటివాడినీ కాదు చివరివాడినీ కాదు
ఎందరి అడుగుజాడల్లోనో నేనూ నడుస్తున్నా
దారి చేసుకుంటూ నడిస్తేనే దాసోహాలకు తెరలు పడేది
ఉన్నదేదో ఉంది అనాదిగా దృఢమైన పునాదిగా
నేననుకున్నట్టు లేదది..అంతమాత్రాన ఏమైంది
ఏమీ కాకపోయినా నాకేదో ఆందోళన
నా కొలతలతోనే అందరిచొక్కాలూ కుట్టించాలని తపన...

ప్రతితరంలోనూ ఒకడికో ఇద్దరికో ఉన్నదేదీ నచ్చదు
అక్కడనుండీ అంతా ఏదో అయిపోతోందని ఆరాటం
తాను రాత్రంతా మేలుకున్నా...లోకం నిదురలోనే ...
మనమేదో మార్చాలనుకున్నా
లోకం తన మానాననే తాను నడుస్తూ ఉంటుంది
ఎవడి గీత వాడిది...ఎవడి నీతి వాడిది
అసలేం మారాలో అందరం కలిసి ఆలోచించిస్తే గదా!!!!

106

ఫోన్ గురించి అడిగితే
దాని కెమెరాల గురించి చెప్తారు
కారు గురించి అడిగితే
దాన్లో స్పీకర్ల గురించి చెప్తారు
బస్సులో సీట్ల గురించి అడిగితే
వేసే వీడియోల గురించి చెప్తారు
పూజావిశేషాల గురించి అడిగితే
ప్రసాదాల రుచిగురించి చెప్తారు

ఒక్కటీ సవ్యంగా ఆలోచించలేమా?
ఏది ఎందుకో కానిదెందుకో
కళ్ళున్నా గమనించలేమా?
ఉభయభ్రష్టత్వాలూ ఉపరి సన్యాసాలూ.....
దహనకర్మలో కట్టెలు పచ్చిగా ఉన్నా
వైకుంఠరథం మాత్రం వెలిగిపోవలసిందేనా?

107

నాకు పిచ్చి
పిచ్చిలోనూ బుఱ్ఱ బాగా పనిచేస్తుంది
నీకూ పిచ్చి అంటాను
చచ్చినట్టు నువ్వు నాకు మద్దతు పలుకుతావు
పలకకపోతే
నా పిచ్చిని ఉపసంహరించుకుంటాను
నీకు మాత్రమే పిచ్చి అంటాను.. నాతో పెట్టుకోకు

ప్రపంచాన్ని శూన్యం అన్నరోజే పిచ్చి మొదలైంది
మాయ అన్న పదం ఒంటబట్టగానే
అదిముదిరి పాకాన పడింది
రోజంతా కాషాయంలోనే ఉన్నా
తెల్లారే సరికి కాఫీకోసమే కాస్త కలవరింత
వాస్తవం తెలిసీ వాదనావైదుష్యాన్ని ప్రకటించటం
ప్రసరదున్మాదవీథీవిజృంభణవిపర్యాసవిన్యాసమే...

108

సుభాషితాల భార మైనా
ధర్మపన్నాల సారమైనా
మధ్యతరగతి జనాల భుజాల మీదే
ప్రవచనాల హోరైనా ప్రకటనల జోరైనా
మధ్యతరగతి జనాల మనస్సుల మీదనే
అష్టదిగ్గజాలూ కాదు ఆదిశేషుడూ కాదు
ప్రపంచభారాన్ని మధ్యతరగతివాడే మోస్తున్నాడు

పైవారల కీ క్షోభలు పట్టమన్నా పట్టవు
క్రింది వారిని ఈ మతలబు లేవీ కదిలించవు
భూగోళం బరువంతా తమ మీదే ఉన్నట్టూ
తాను తప్ప ఈ పుడమికి గతియే లేదన్నట్టు
నిత్యకళ్యాణాలూ నిందలూ నిష్ఠూరాలూ
మధ్యనున్న త్రిశంకువులం మనకే పట్టా యెందుకో
ధర్మశాస్త్రసారమంతా మననే పీడించట మెందుకో...

109

మనం పిలిస్తే అన్నీ పలకాలి
స్థలాలూ పొలాలూ ఉపరితలాలూ..
మనం కదిలితే మనతోపాటే కదలాలి
హలాలూ కలాలూ ఉద్వేగక్షణాలూ..
మనం పరవశిస్తే తామూ రసించాలి
సరదాలూ పరదాలూ పరీసరాలూ ...
మనం మబ్బుల మైతే అవి వానచుక్కలవ్వాలి

పంచీకరణంతోనే పాంచభౌతికఘర్షణ..
ఓషధులు మొలకలతోనే ముగింపు లేని పంపకాలు
నీకూ నాకూ కలిపి ఒకే నేల
నీ ముక్కకు నువ్వూ నా ముక్కకు నేనూ
వారసత్వంతో సహా మొక్కవోని బానిసలం
విశ్వభావనకు యోజనాల దూరంలో మనం
ముక్క లేరు కుంటూనే ముందస్తుగా వెనుకే ఉన్నాం.

110

వేసవి మొదలవగానే ఎండవేడిని గురించీ
తొలకరి మొదలవగానే వడగళ్ళను గురించీ
వానల చరిత్ర గురించీ, పెద్దగాలివాన గురించీ
శిశిరంలో శరత్తులో మంచువెన్నెల తెరలగురించీ
-ప్రతిఋతువూ సకాల అతిథే అయినా సరే-
అందరికన్నా ముందు ప్రస్తావించినవాడే లోకజ్ఞుడు
పెళ్ళిసందడిలో పేకముక్కల గురించి కూడా....

తెచ్చిపెట్టుకున్న పెద్దరికం ఆత్మీయభాషణకు నాంది
యథాలాపకథాలాపాలకూ లోకాతీతత్వం అంటగడుతుంది
ప్రాచీనతాప్రమాణాలకు మరో ఆకు తొడిగిస్తుంది
నిన్నూ నిన్నలా బ్రతకమంటుంది
కాదంటే రేపటికి శాపనార్థాలూ పెడుతుంది
ఏటికీ ఏరువాకకూ పోటీపెట్టి
ఏది ముందయితే అటే తాను మొగ్గుచూపుతుంది

111

ఇల్లు అద్దెదే-నిజమే
శుభ్రంగా ఉంచుకోవటం తప్పందామా?
ముల్లె పరులదే-అవును
పదిలంగా కాపాడటం నేరమైపోతుందా?
ప్రళయం ఎప్పుడైనా రాక తప్పదు-సరే
ఈ రోజునుండే చంచాలతో సముద్రాన్ని తోడుదామా?
హెల్మెట్ ఉందని శీర్షాసనం వేసి బండి నడుపుదామా?

అసలు సమస్యలు అవేనా?
తలకుమాసిన పనులో తలకు మించినపనులో
తలకెత్తుకోవటం కాదూ?
మనకే మనం నచ్చకపోవటం కాదూ?
కుదరకపోతే నెపం ఎవరిమీదనో వేయడం కాదూ?
నెపపడేవాడు మనిషైనా దేవుడైనా మన కిష్టమే కాదూ?
అసలు సజావుగా ఉంటే ఎవరి నాపగలిగింది చరిత్ర?...

112

బంగారాన్ని కరిగించి నగ చేసినా
నగను కరిగించి మేలిమి చేసినా
విలువా సమానమే..గౌరవమూ సమానమే
మరెందుకు నగను తుచ్ఛంగా చూడటం
ఆ చూపే దివ్యజ్ఞాన మని భ్రమపడటం
ఆధ్యాత్మిక మంటూ అదే పనిగా మొత్తుకోవటం
ఉన్నదాన్ని నచ్చలేని మచ్చపడిన బ్రతుకేగా అది!!

చెట్టునుండీ కాయా..పరిణతిలో పండూ
మళ్ళీ గింజా.. మరో చెట్టు..ఇది ప్రకృతి
గింజ పుచ్చిపోతే వ్యవసాయం చేతకానట్టు...
చేతకానితనానికి సిద్ధాంతీకరణమా?
దుర్బలులందరూ కలిసి దొంగదెబ్బ తీయటమా?
శరీరాన్ని కాపాడరా జీవుడా అని నిర్దేశిస్తే
పారిపోయి వస్తానురా దేవుడా అంటారేమిటి????

113

మనం చేసిన దేవుడు కాబట్టే
మధ్యమధ్యలో మంచినీళ్ళు త్రాగిస్తాం మనకులాగే
పంచామృతస్నానం మాత్రం ఆయనకు అదనం
మనకూ ఉండేదేమో ఒకప్పుడు బాగా బ్రతికినప్పుడు
భోజనానంతరం చేతులూ కాళ్ళూ కడుగుతాం
ఆపై మరోమారు మంచినీళ్ళు మనకులాగే
మనం దేవుళ్ళం కాలేం.. ఆయన్నే మన స్థాయికి దించుదాం

మూలుగుతోనే మరోప్రాణికి జన్మనిచ్చే శక్తి దైవం
పాలుపోసుకునే కంకిలో గింజ పరవశించటం దైవం
విద్యుచ్ఛక్తి లేకున్నా గుండె కొట్టుకోవటం దైవం
శక్తిని పిడికిలిలోనికి తెచ్చి కొట్టే కరాటేదెబ్బే దైవం
రెండింటి మధ్య ఘర్షణలో త్వరీభవించే శక్తి దైవం
కాలు జారి నేలమీద పడ్డవాడు కాలధర్మం చెందితే
చెట్టు మీదనుండి పడీ చిరునవ్వుతో లేవటం దైవం..

114

ప్రపంచం ఎప్పుడూ తప్పు చేయదు
తనలా తాను నడుస్తూనే ఉంటుంది
ఎవ్వరికోసమూ ఆగదు ఎవ్వరికోసమూ మారదు
మనమే అర్థం చేసుకోవటం చేతకానివాళ్ళం
మనలా అది లేదని గొడవపడుతూనే ఉంటాం
నేల మెట్టినప్పటినుండీ వల్లకాట్లో నీఱయ్యేదాకా
దేని శైలి దానిది దేని వైనం దానిది

ఎవరి బ్రతుకు వాళ్ళను చూసుకో మంటుంది
ఎవరి కాళ్ళతోనే వాళ్ళను నడవ మంటుంది
మనమే సూక్తులూ సుభాషితాలూ వ్రాసుకుంటూ
ఏదోలా ఏదీ లేదని ఆందోళనపడుతూ
మనం చెడి దాన్ని చెడుపుతున్నాం
నీళ్ళు నీళ్ళలాగే..నిప్పు నిప్పులాగే ఉండాలి
తేడా వస్తే భూకంపాలే..భూస్థాపితాలే

115

అందరూ అక్కడకు చేరటమే
ఆనందంగా నాలుగు రోజులు గడపటమే
వెలుగుబాటలను విస్తరించుకోవటమే
నలిగిన భావాలకు నవ్యత చేకూర్చుకోవటమే
ఎవరూ ఎవరికీ అడ్డు కాకుండా
ఆర్తిగీతాలనైనా ఆలపించగలగటమే...అదే మాహాత్మ్యం..
అది జలమైనా తలమైనా మనమైనా జనమైనా

ఎవడో శాసిస్తే క్రమశిక్షణతో మెలిగే మనం
స్వతంత్రంగా మెలగమంటే ఒక్కుమ్మడిగా లేస్తాం
అందరమూ పే...ద్ద మనుషులమే
అందుబాటులోని వాటాలలో మాత్రం
ఎవరికి వారికే ఏదో బావుకునే కలవరం..అందుకే
దేవుళ్ళే ముక్కలుగా విరిగి ఎక్కడికక్కడ నిలిచినా
మనం మరీ ముక్కలమై పోయి మనచుట్టూనే తిరగడం...

116

అలకలను అలాగే వదిలేసినా
పిలకలను లాగి ముడివేసినా
అదొక అలవాటో అభిలాషో అంతే ..
ఆ సిగలోనే పరమాత్మ ఉన్నాడంటూ
నారాయణసూక్తాన్ని నవ్వులపాలు చేస్తే ఎలా?
తమలపాకుల తొడిమలు అటో ఇటో తేల్చకుండానే
అష్టైశ్వర్యాలనో అష్టదరిద్రాలనో ఆపాదిస్తే ఎలా?

సినిమా నంతా సిగరెట్ పొగతో నింపేస్తూ
పాపకారణాలతోనో(పాప్ కార్న్)కాంబో ఆఫర్లతోనో
సినిమాహాలు నంతా ముంచేస్తూ
ఆదాయాన్నంతా ఆల్కాహాల్‌తో ముడివేస్తూ
జి ఎస్ టి వసూళ్ళతో ప్రభుత్వాలను ఎక్కేస్తూ
మద్యపానం ధూమపానం ఆరోగ్యానికి హానికర మని
ఎప్పటికప్పుడు చె..ప్తూ..నే ఉంటామంటే ఎలా?

117

నేనూ పద్యాలు నిమ్మళంగా రాస్తున్నా
కానీ భావాలు కర్కశంగా వస్తున్నాయ్
తీరా చూస్తుంటే తిప్పలూ జారుబాట్లూ
'పోరా పో ఇంక ...బుద్ధిలేని వెధవా
శార్దూలానికి ఎక్కువా చంపకమాలకు తక్కువా!'
ఇలా కవిత్వం తిట్లు కదం త్రొక్కుతున్నాయ్
నాలుగురాళ్ళే ముఖ్యమని రెచ్చగొడుతున్నాయ్..

మనతో పాటు పుట్టనే లేదు ఆ రాయి
మనం పుట్టినప్పుడు అది లేనే లేదు
మనకంటే చిన్నది..దానికున్న దన్నే అది
మన వెంటే ఉన్నది అయినా ముందుకూ వెనక్కూ
ఎటైనా దూసుకుపోతుంది.. కన్ను మూసి తెరిచేలోగా
ఇప్పుడది విశ్వవ్యాపి ...పరమాత్మలాగా
ఇప్పుడదే దిక్సూచి.. దిగంతాలలో వేయాలన్నా పాగా

118

ఒకడికి ఆబ ఎక్కువ
వాడేవాటికన్నా ఒలికిపొయ్యేవే ఎక్కువ
ఒకడికి యావ ఎక్కువ
వాడటానికన్నా వాసనపట్టిపోవడమే ఎక్కువ
ఇద్దరూ అంతర్జాతీయస్థాయిపురుషులే
అక్షాంశరేఖాంశాలకు అటు ఇటుగా ఊగేవారే
కలలకూ కావిళ్ళకూ మోతబరువుగా మిగిలేవారే

మనమేం పుట్టలం కాదు
బోలుగానే పెరుగుతూ విరిగిపడటానికి
మనమేం కట్టుబొట్టులం గాదు
కాలం తీరిపోయినా మిగిలి ఉండటానికి
మనకు నవనవచైతన్యమే ఊపిరి
బండబారాలన్న తపన మనసులో ఎందుకు?
శిల్పాలు కాగల చేవ మనకెటూ లేదుగా...

119

ఆదివారం వర్జ్యాన్ని
సోమవారం రాహుకాలాన్ని
మంగళవారం వారాన్ని
బుధవారం తిథిని
గురువారం నక్షత్రాన్ని
శుక్రశనివారాలు యోగకరణాలనూ
ఒక్కసారి చూసుకుంటా.. అంతే...

నాకే మంతగా మూఢవిశ్వాసాలు లేవు
అందుకే వాస్తుతో సంబంధం లేని ఇంటికోసం
ఎప్పటినుండో ఎదురుచూస్తున్నా
అన్నీ నూరుశాతం వాస్తుతోనే ఉన్నాయి
నాకేమో ఎక్కడో ఏదో కుదరనట్టనిపిస్తోంది
అందుకే అసలు వాస్తు లేని ఇల్లు దొరికేదాకా
అన్వేషిస్తూనే ఉంటాను నేను....అంతే

120

తేగలు త్రవ్వి బురగుంజు కొట్టిచ్చే వాడూ
పందుంపుల్ల విరిచి ఇచ్చి పలకరించే వాడూ
గంపలో తెచ్చి తోటకూరా గోంగూరా అమ్మే తల్లీ
అరకదున్నే అబ్బాయీ! బండితోలే బాబాయీ!
కవిసమ్మేళనానికి రారేం ?.. వాళ్ళగురించే కదా రాస్తున్నాం..
అలా నోళ్ళు వెళ్ళబెడతారేం? కళ్ళు తేలవేసి చూస్తారేం?
వాళ్ళగురించి రాసినా మనమే చదివి మనమే వినాలా?

నిజంగా ప్రజల కోసమే అయితే పాణింధమాల దాకా పోవాలా?
అందరికోసమే అయితే కరికరిభిద్గిరిగిరిభిత్తులు అవసరమా?
అందరూ అంటే వాడూ వీడూ కాకపోవచ్చు
నువ్వూ నేనూ అయినా కావాలిగా కనీసం...
ఆవేశపడటమే కానీ అందరికోసం రాయగలమా?
ప్రజల గురించి రాస్తున్నామే గానీ ఆ ప్రజకు చదువే రాదు
మన అదృష్టమూ అదేగా..కాకుంటే మనల్ను భరించగలదా?

121

చేతులుండేది ముక్కు మూసుకోటానికని
ముందుగానే గుర్తించిన జాతి మనదే
చేఁతను ముక్కలు ముక్కలు చేసి
మూడుముక్కల ఆటలాడుకునే నీతి మనదే
కర్మనూ యజ్ఞాన్నీ ధర్మాన్నీ పర్యాయపదాలు చేసి
మొత్తాన్నీ ఖండించుకొన్న ఖ్యాతీ మనదే...
భగవద్గీతా శాంకరభాష్యం ...రెండూ మనకు కరదీపికలే !!

విముక్తి పేరుతో విషాదాత్మక మైన ఆటగా
అంచులూ కంచెలూ లేని అదోరకమైన వేటగా
బలుసుజీవితాలను బలిపెట్టడమే గానీ
ఇంతకన్నా గొప్పచోటు విశ్వాంతరాళంలో ఎక్కడుంది?
ఆలోచనలు మిణుగురు పురుగుల్లా ఎగిసినా
అంత చీకటిలోనూ ఇంత వెలుగును ఇస్తాయి గదా
ప్రాభాతిక కాంతివలయంలో మనమూ ఒక కిరణం కాలేమా?

122

తెలిసీ అడిగే ప్రశ్నలు కొన్ని
తెలిసీ తెలియక అడిగేవి కొన్ని
తెలుసుకోవాలని అడిగేవి కొన్ని..
తెలీదంటే అజ్ఞాని వని వెక్కిరిద్దామని
తెలుసంటే అంత పొగరా అందామని
మౌనంగా ఉంటే అహంకారి వని ఆడిద్దామని
ఎలా ఉన్నా ఏదో ఒకటి అని తీరాలని...

దయ్యాలమేడలో దయ్యాలున్నాయన్నా కోపమే
దేవుడిగుడిలోనే దేవుడు లేడమో అన్నా కోపమే
దయ్యమంటే దేవుడేరా అని
చెప్పే ప్రయత్నం చేసినా కోపమే
దయ్యాల మాటలు విని విని
దయ్యాలే అవుతున్నారు మనుషులు కూడా
తెల్లగా సన్నగా రివటలా గాలిలా అటూ ఇటూ ఊగుతూ

123

ప్రపంచం నా చుట్టూ తిరుగుతుంది
ప్రపంచం చుట్టూ నేను తిరుగుతుంటాను
దానికి నా మీద ప్రేమా లేదు
నాకు దానిమీద గౌరవమూ లేదు
రెండూ నటనలే...కపటనటపటుపటాటోపాలే
'ఎవరి లాభం వారిది'... సిద్ధాంతాలే ఇద్దరివీ..
ఎదురునిచ్చెనలమై ఇద్దరమూ నిలవటమే..ఇలా...

నిజం...నీ బ్రతుకు నీది నా బ్రతుకు నాది
చేయీ చేయీ కలిస్తే చిదాంతర్యాన్ని తాకాలి
ఉత్తర చూసి గంప ఎత్తేవాళ్ళం మనం
మనకే సందు చాలకుంటే కూడా డోళ్ళు
సంతకాలు చేయటం మరిచిపోయిన
సంఘం శరణం గచ్ఛాములం కాదూ మనం?
కాలు విరిగిపోయిన ముక్కాలిపీటలం కాదూ మనం?

124

కరచాలనాలను మంత్రముగ్ధం చేస్తూ
పలకరింపులను పచ్చికొబ్బరిముక్కలను చేస్తూ
అక్షింతలు నోట్లో వేసుకునే వాళ్ళను లెక్కపెట్టుకుంటూ
మామిడాకులతో మంతనాలాడుతూ
అరటాకులపై అక్షరాలు దిద్దుకుంటూ
మీ మానాన మీరు కదులుతూ
అందరితో కలిసి మనసారా నవ్వుకోండి

మగాళ్ళూ మంచివాళ్ళే పాపం
ప్రతికాఫీకప్పులోనూ చివరిచుక్కను
శ్రీవారికి అంకితం చేస్తూ సిప్ చేయండి..
హాయి హాయిగా ఆమని సాగే పాటలో
మనీని గురించి ఆలోచించకండి
చేతిలోని ఫోనే కాదు
మరిచిపోయిన ఫోనూ మధురస్మృతి కావాలి

125

ఒకడు dabba అంటాడు
ఒకడు dubba అంటాడు
ఒకడు dhbbha అంటాడు
ఒకడు dhbhbha అంటాడు
పలుకుల్లో భేదా లున్నా
గులకల్లో తేడాలున్నా
మ్రోతమాత్రం ఒక్కటే... డబ్బామోతే...

పొగడ్తలు వినిపిస్తూ ఉన్నంతసేపూ
ఆ మోతే జాతికి మంగళవాద్యం.. అయినా
పొగడ్త వినగానే చెవులూ తలా సరిచూసుకోవాలి
కొమ్మలైనా నిలిచి ఉండవచ్చు
కొమ్ములైనా మొలిచి ఉండవచ్చు
అదీ ఇది కాకుంటే ఆకులు రాలిన చెట్లకొమ్మల్లా
ఆలోచనలు ఒరుసుకొని దావనూ పుట్టించవచ్చు

126

రుద్రాక్షలు వేస్తే అష్టైశ్వర్యాలూ అని ఒకడు
ఉంగరాలు పెట్టుకుంటే ఊళ్ళేలుతావని ఒకడు
స్పెల్లింగులు మార్చుకుంటే బిల్డింగులన్నీ నీవే అని ఒకడు
గవ్వలు గుట్టగా విసిరి గుట్టులన్నీ లాగేవాడొకడు
దేవుడికే తెలియని నూనెలతో పత్తులతో ఒత్తులతో
కస్టమైజ్డ్ దీపారాధనతో కలిమిని జవురుకోవాలని ఒకడు
తావీదుల తాఖీదులతో దేవుణ్ణే బెదిరించేవా డొకడు…

ఆశ ఆడించే వైకుంఠపాళి ఆటలో
నిచ్చెనల వేపే చూస్తూ కొందరు
పామునోటబడగూడదని ప్రార్థనలతో కొందరు
బుద్ధుడి శూన్యవాదంతో కొందరూ
నిత్యశుద్ధుడి మాయావాదంతో కొందరూ…
బ్రతుకుబాటలో బండలు మొలిపించుకొని
తట్టుకొని పడుతూ బూరెల గంపలు వెదుకుతూ అందరూ

127

గోడలనిండా దేవుడి పటాలు.. పెద్దల ఫోటోలూ
అండ్ సన్స్, అండ్ బ్రదర్స్, అండ్ కో ల కాలెండర్లు
క్రిందవైపు చిన్నపిల్లల చిత్రలహరులు
దండెంపై కావిరంగు అంగవస్త్రాల చిరుగులు
కాళ్ళకడ్డం పడుతూనే పేదింటి ఎలుకలు
అనుక్షణం శకునం చెప్తూ గోడమీద బల్లులు...
అయినా అందుబాటులోనే ఆనందపు టంచులు

పెద్దపెద్దగదులూ, గదులు పట్టని మంచాలూ
ఎత్తుగా ఒత్తుగా పరుపులు, తలగడలు, కాలిగడలూ
అటూ ఇటూ పొర్లినా రెప్ప వాల్చలేని కళ్ళు
కాపటాలు ఎన్ని పెట్టినా బేరానికి రాని కాళ్ళు
అసూర్యంపశ్యలు పశ్యులైన వర్ణవిపర్యాసాలూ..
బ్రతుకేమో అయోమయం మనసేమో జరామయం
అయినా అందుబాటులోనే విఫలవిగళనైరాశ్యం

128

గడ్డంపై వెంట్రుకలు మొలవకముందే
బుంగమూతి పెట్టి డిమాండ్లు సాధించినవాణ్ణి
గడ్డం పుచ్చుకొని బ్రతిమిలాడితేనే
పాలూ పెరుగూ ఐనా నోటబెట్టుకునేవాణ్ణి
అక్షరాలైనా బొమ్మలైనా పిచ్చిగీతలైనా
బలపం గడ్డానికి తాకించిన తర్వాతనే...
చిన్నప్పటినుండీ అంతే.. నా పట్టంతా గడ్డంలోనే

వయస్సు పెరుగుతున్న కొద్దీ లోకాన్నీ గమనించా
పెంచుకున్న గడ్డమే పెన్నిధిమూలమని గ్రహించా
మామూలు మనిషి మహాత్ముడైపోయే మహత్తరసాధనం
మోకాళ్ళ దాకా పెంచుకున్న గడ్డమే అని విశ్వసించా
అబద్ధాల అవసరమూ లేదు నమ్మించే పనీ లేదు
అదే నమ్మేస్తూ ఉంటుంది పిచ్చిలోకం.. పిచ్చిమాలోకం
లోకం నన్ను నమ్మితే.. నేను లంబకూర్చాన్ని నమ్ముకున్నా...

129

నాతోనే నేను మాటాడుకుంటా మంచైనా చెడైనా
అయినా ఈ నాగరికప్రపంచానికి నచ్చదట
వారిలాగే నేనూ ఆలోచిస్తూ ఉండాలట
వారి వాగనుశాసనాలే నేనూ అనుసరించాలట
వారి నాగరికతాభాసాలే నేనూ జీర్ణించుకోవాలట
అందుకే అవసర మవుతున్నాయేమో వారికి
క్షణానికొక మన్నింపూ నిముషానికొక తెగింపూ

దారివేసిన దార్శనికులు తమ చూపునే నమ్మినవారే
వేసవిలో తెల్లపూలే విరివిగా పూసినా
ప్రావృట్టులో నల్లమబ్బులే విస్తారంగా కురిసినా
ముక్కుసూటిగా చింతించి మూలసూత్రాలు సాధించినవారే
ముక్కే వంకరగా ఉంటే పుట్టేది ముక్కుమూతిపిందెలే...
ఏ దర్శనమూ గతానుగతికఫలితం కాదు
ఏ అభ్యుదయమూ ఉన్నచోటనే ఉండి సాధించిందీ కాదు...

130

ఆవేశం ఆషాఢమేఘం కాదు
ఉరుములు మెరుపులతో బెదిరించటానికి
నదీరూపంతో ఉరుకుతూ మీదపడే వరదా కాదు
కూలాలను కుదేలు చేసి కనుమరుగై పోవటానికి
తోక కాలి అటూ ఇటూ ఎగరే కోతీ కాదు
అందినకాడికి దహించి అమాయకంగా చూడటానికి

అది ఆక్రోశానికి మరో పేరూ కాదూ రూపమూ కాదు
అది నీటిమీది బుడగ కాదు.. లక్ష్యం దిశగా నిరంతరప్రవాహం
గమ్యం వైపుగా అర్ధాంతరంగా ఆగని పయనం
సందెవేళ అస్తమించినా ఉదయానికి ఉద్యమం
ఎర్రజీరలు కంటి నంటుకున్నా రెప్పలను నమ్మిన పురోగమనం
ముందుచూపుతో ముందే స్పందించటం ...
ప్రతిస్పందనే ఆవేశ మైతే ప్రతిప్రాణీ మనిషికన్నా గొప్పదే

131

అష్టదిక్కుల్లోనూ ఆత్మీయులే చేతుల్లో మొబైళ్ళతో
నేల నాలుగు చెరగులనుండీ బృందగానమిత్రులే
పిలుస్తూ కొందరు పలుకరిస్తూ కొందరు
సందేశాలతో కొందరు వాక్సందేశాలతో కొందరు
ఊపిరాడనీకుండా ఊపిరితీస్తూ కొందరు..
ఆ దూరపుటాత్మీయుల చిలుకపలుకరింపులతో
పరిసరప్రబంధాల మధ్య కూడా ప్రతివాడూ ఒంటరివాడే

అయినా ఎవ్వరూ ఎవ్వరినీ తప్పు పట్టరు..
పెనుగాలికి ఆకైనా కదలని చెట్టే గదా
గాలివాటపు చెట్లను చూసి నవ్వగలిగేది..
గొంగళిపై గోస్తనీరసాన్ని ఒలకబోసుకొని
నాలుకతో నాకుతూ కూడా నవ్వగలిగే వాడే గదా
కంచంలో తినేవాడికి సవాలు విసరగలిగేది..
అందరూ అంగుళికండూతులే..వ్రేలెత్తి చూపే దెవరు?

132

సాలెపురుగులకూ సాటి కాలేం
పట్టుపురుగుల కన్నా మేటి అనలేం
పునుగుపిల్లులమూ కాలేము
ఊసరవెల్లులమూ కాలేము
పాముల్లా పడగలూ విప్పలేం
నెమలుల్లా పురులు విప్పలేం
మాటాడే ముందైనా మనస్సూ విప్పలేం..

మనస్సు నట్టువాంగం వేస్తుంటే
నాలుక నవరసనాట్య మాడుతుంది
వెక్కిరించడానికిప్పుడు నొసలు అక్కరలేదు
నోటిమాటల్లోనే రెండర్థాలనూ పలికించగలం.
మన మెటూ చెడ్డాం..వారసులనైనా సరిగా బ్రతకనిద్దాం
నవతరానికి ఆస్తు లివ్వకపోయినా ఫరవాలేదు
కూటనీతిని రాచబాటగా వ్రాసివ్వకుండా ఉందాం

133

మొక్కలకూ ఆశ ఉంటుంది
మనలా తోటలు పెంచుకోవాలనీ
మనలా పూలను చూసి మురిసిపోవాలనీ
చివురుల పొటమరింతలకు కళ్ళప్పగించాలనీ
మారిన ప్రతిఋతువూ తానే అయి తరించాలనీ
పాదాలు పాతాళం దాకా ప్రాకుతున్నా
శిరస్సు అంబరచుంబిమహోన్నతమే కావాలనీ

అందుకే పాదుచుట్టూ మరో తోటను పెంచుకుంటాయవి
పూచేవాటినీ పూయనివాటినీ సమంగానే పెంచుతాయవి
తమ నీళ్ళలో వాటా యిచ్చి తమ పాదులోనే చోటూ ఇచ్చి...
మనకే భేదబుద్ధి... ఒక మొక్కను పదిలంగా పొదరిల్లు చేస్తూ
మరో మొక్కను కలుపుమొక్కంటూ మొదలంటా పీకుతాం
అది కలుపు మొక్కే మనకు ...కానీ అసలు మొక్కకు
బ్రతుకుబొమ్మలకొలువులో పదిలంగా పెంచుకొనే పెరటితోట అది

134

ఒకడు కట్టు మారుస్తాడు
ఒకడు జుట్టు మారుస్తాడు
ఒకడు బొట్టు మారుస్తాడు
తెల్లచీరను అద్దకంతో
కావిరంగు చేస్తా డొకడు
గుల్లనేలను తొక్కిపెట్టి
పొలం మారకం చేస్తాడొకడు

మార్పు మానవసహజ మంటూ
అడ్డదిడ్డంగా మారుతా డొకడు
ఋతుధర్మాలన్నీ మారిపోతున్నాయంటూ
అందరినీ భయపెడతా డొకడు
వంటిళ్ళన్నీ కర్రీ పాయింట్లుగా మారినా
నీళ్ళనే అమ్మి నిలువెత్తుగా బ్రతికేస్తున్నా
మనం మాత్రం మారం..మనలోని ఇద్దరినీ బ్రతికిస్తుంటాం..

135

పిడికెడు మెదడులో విశ్వప్రపంచవిక్షేపం
చిటికెడు చిప్పులో విశ్వవిజ్ఞాననిక్షేపం
అంతా సవ్యంగానే అందంగానే అందులోనే
ఒక్క పోకిరీపనో ఒక్క చేతకానితనమో చాలు
విజ్ఞానం కలగాపులగమై విశ్వాన్ని స్తబ్ధం చేయటానికి
ఒక్క విక్రియయో ఒక్క ప్రతిక్రియయో చాలు
పిడికెడు మెదడూ చితికి ఛిద్రమై చిదుగు లవటానికీ

ఒకటి శుద్ధచైతన్యం ఒకటి బుద్ధచైతన్యం
రెండింటికీ నువ్వూ నేనూ మాత్రమే క్రీడాకేంద్రం
ఫలితం... నిత్యనూతనవికల్పవినోదవిషాదం
పరవశాలూ లేవు... పరశువేదులూ లేవు...
చక్రభ్రమణంలో నిలువలేకుంటే జారిపోవడమే
చెట్లలా కూలటం కాదు తీవెలా బ్రతకటం తెలియాలి
బంధాలు బలహీనపడితే తోటంతా రాలిన ఆకులే

136

కవిత్వం కలా కాకూడదు కాలక్షేపమూ కాకూడదు
పరమపదసోపానపటంలో నిచ్చెనా కాకూడదు
ఊహలనూ ఉద్వేగాలనూ ఆశలనూ అలమటింతలనూ
స్తోత్రాలనూ చట్టుబండలనూ కాసిన్ని మెంతులనూ
కలిపి రుబ్బి చాటలూ పళ్ళేలూ చేసి
కవితాకలకండల ముక్కలని నమ్మించి.. నిన్ను
నడికడలిలోకి త్రోసి ఒడ్డుకు రమ్మనటమూ కాకూడదు

కవిత్వ మంటే నీకే తెలియని నీ అంతఃకరణం
నువ్వు అర్థమైనట్టు నటించే ఈ ప్రకృతి ఆంతర్యం
శబ్దాలూ అర్థాలూ తమంత తామై కలిసిన కలశం
సత్యమూ సౌందర్యమూ జోడెద్దులుగా
బండ్లబాటపై నడిచే క్షణక్షణనవీకృతధర్మశకటం
మనపబ్బం గడవడానికి ఆణ్ణో ఈణ్ణో పొగడటం కాదు
విశ్వపర్వదినంనాడు తొలిగా పలికే పుణ్యాహవచనం

137

బాటకు అటుగా నువ్వూ ఇటుగా నేను
బాటలో విడిదియైన తోట నీకటూ నాకిటూ
పరిమళం పరుచుకుంటుంటే అల్లల్లాడిపోతావేం
మాలిమి చేతకాని తోటమాలిలా అంగలారుస్తావేం
పరిమళాన్ని శాసించే నెపంతో పువ్వునూ నలుపుతావేం
అది పృథివి... బ్రద్దలైతే చేయీ మిగలదు నువ్వూ మిగలవు
పువ్వుకేం? పుడమిగుండెల్లో తలదాచుకుంటుంది

కాకుంటే కాలం ఇంతకాలం బ్రతికి బట్ట గట్టేదా?
ఏ రాసాయనికచర్యో కుదిరి ఖనీభవించకపోతే
ఇన్ని రకాల వింతముఖాలు ఏ చరిత్రకైనా అందేవా?
పామూ ముంగిసా ఒకే బుట్టలో ఇమిడినట్టు
దావా లావాలు చెలరేగి చేయీ చేయీ కలిపి
బడబవైపు ఉరుకులు పరుగులతో దొర్లుతున్నట్టు
ఇంతమందీ కలిసి బ్రతకటాలు ఇప్పటికీ కుదిరేవా?

138

నా కస్సులు నచ్చనివి రెండే
ఒకటి నువ్వూ ఒకటి నేనూ
నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు బ్రతుకుతావే
అందుకే నువ్వు నచ్చవు
అయినా నేను ఏమీ చేయలేకపోతున్నా గదా
అందుకే నేనూ నచ్చను
నా నీ కలిపి చూద్దామంటే మూడోవాడికి నచ్చం

రెండు దోటీలనూ కలిపితే ఎంత ఎత్తులో ఉన్నా
పండు లంబకోణంలో ఒడిలోనే పడుతుంది ...తెలుసు
ఆ ఒడి నీదా నాదా అన్నదే మహాప్రలయసంశయం
సునామీ వస్తే అన్ని కొంపలూ కూలుస్తుంది..అయితే
అటునుంచీ నరుక్కు రమ్మని ఇద్దరమూ అంటాం
ఆశ్చర్యంగా అనిపిస్తోందా?...ముసుగులో ఉంటే అంతే
ఆంతర్యాన్ని తట్టి లేపుదాం...సాక్ష్య మదే పలుకుతుంది

139

అందమూ ఆత్మవిశ్వాసమూ తోబుట్టువులు
సత్యమూ సౌందర్యమూ సహజాతాలు
రెంటినీ విడగొట్టి వివేకాన్నీ విషాదాన్నీ కలిపాం
అసంబద్ధవైరాగ్యాలతో అనుపలబ్ధమిథ్యావాదాలతో
దృష్ట్యభేదాన్ని కాదని సృష్ట్యభేదమంటూ చెలరేగుతున్నాం
కాఫీలేకుండా బ్రతకలేనివాడికీ కాషాయం కట్టేస్తున్నాం
గంతకు తగ్గ బొంతల గుంపులో వేదాంతం వల్లిస్తున్నాం

పరమాన్నం పచ్చికారం రెండూ పదార్థాలే..
రుచిభేదంలో అనుభవభేదం లేదంటే ఎలా?
వేపచెట్టూ బూరుగుచెట్టూ రెండూ చెట్లే..
నీడను అనుభవిస్తూనే తేడా లేదంటే ఎలా?
పండితుడూ పామరుడూ ఇద్దరూ ఒకటే..
శాలువా కప్పించుకుంటూనే చాదస్త మంటే ఎలా?
మాటల మాంత్రికులమైతే చాలదు చేతల సివంగులం కావాలి

140

'గోడమీది మూడోవాడు' ఒకప్పటి గొప్ప కథ
ఇప్పుడు వాస్తవమై సలుపుతున్న ఒక వ్యథ
పిల్లితగవూ పిల్లితగవూ పిట్ట తీరుస్తుంది
పంచుతున్న కోతే మొత్తం రొట్టెనూ తింటుంది
సామెతలు చదివితే చాలదు..అనుభవమూ కావాలి
దిగడం చేతకాని వాళ్ళు ఇద్దరు పైకెగిరితే
మూడోవాడి చేతుల క్రిందే జారవలసివస్తుంది

విరుగుడు మంత్రం తెలియనప్పుడు
ప్రయోగాలు అసలు చేయట మెందుకు?
మక్కబెట్టడం చేతకాకపోతే
పచ్చికాయలను కోసే ఉబలాట మెందుకు?
కుప్పనూర్చటం కుదరనప్పుడు
వరి వైపుకు మనసు మళ్ళించట మెందుకు?
నేనన్నానని కాదు.. నీకైనా నువ్వు తెలియాలి

141

గాలి కొంచెం సహకరిస్తే చాలు
నీరు బుడగ అవుతుంది
పిల్లకాలువ గలగల అవుతుంది
వెదురు వేణువు అవుతుంది
పర్ణం ప్రాణవాయువు అవుతుంది
హిమం స్వచ్ఛజల మవుతుంది
మావి మధురసాల మౌతుంది

గాలి కొంచెం సహకరిస్తే చాలు
పలుకు గాలిమాట అవుతుంది
కాలం గాలికబుర్లు అవుతుంది
తెరచాప ఎదురీత అవుతుంది
చూపు చలనచిత్రం అవుతుంది
మబ్బు పలాయనమంత్రం పఠిస్తుంది
మనుషులు గాలిమనుషులు అవుతారు

142

చిలిపిచేతలు బాగా నచ్చితే
బుగ్గగిల్లి మెటికలు విరవవచ్చు
అల్లరిపనులు అంతగా మనసు కెక్కితే
చాటుగా మృదువుగా నెత్తిన మొట్టవచ్చు
తరాల అంతరాలలోనే తమాషాలూ చేయవచ్చు..కానీ
పసుపునీళ్ళపవిత్రతనే మనం పదిలమనుకుంటూ
భావితరాన్ని ఆపస్తంబసూత్రాలు వల్లించమంటేఎలా?

పురోహితుడు కాఫీకి అలవాటు అయ్యేదాకా
యజమాని మంచినీళ్ళు కూడా ముట్టకూడదు
ప్రవక్తల పిల్లలు పానీపూరీకి ఎగబడేదాకా
గృహస్థుల పిల్లలు పీచుమిఠాయీ తినకూడదు
అటూ ఇటూ కాని చాకచక్యాన్ని అంబరీషుడే నేర్పాడుగా
శాస్త్రాన్నీ ప్రేమించాలీ సమాజాన్నీ గౌరవించాలి
ముందు క్రాపూ వెనుక పిలకా.. సమన్వయసారం కాదూ?

143

రుద్రాభిషేకంలో ఆపిల్ రసంకూడా పాల్గొంటుందనీ
ప్రతి అమాసకో శుక్రవారానికో గుమ్మడి గుండె పగులుతుందనీ
పచ్చికూరముక్కలు సలాడీకృతాలై పసందుజేస్తాయనీ
పనీరుతో కలిసి పాలకూర రాజ్యమేలుతుందనీ
సమోసాలు గంపలకెక్కి నడివీథిన పడతాయనీ
బొప్పాయికి కూడా ఫలరాజయోగం దక్కుతుందనీ
ఎప్పుడైనా అనుకున్నామా?ఎన్నడైనా కలగన్నామా?

కాలం కలిసి రావాలి ఒప్పించటం చేతకావాలి అంతే
గరికతో పచ్చడి చేసినా గరం మసాలాలా ప్రేలుతుంది
మిర్చీబజ్జీ వీథివీథినా విహరిస్తూ విశ్వతోవృత మవుతుంది
పండ్లముక్కలూ కరకుట్లై ప్రారంభవిందు లవుతాయి
ఆవిరీ ఆయిలూ తేడా తప్ప ఇడ్లీకీ దోసెకూ ఒకటే పిండి
పుదీనాకు బాలభోగం కొత్తిమిరకు పూర్ణాహుతియోగం
ఇంట్లో నచ్చనివన్నీ బయట నెత్తికెక్కుతాయి అదనపు ఖర్చుతో

144

సుదీర్ఘసమాసాల పద్యం ప్రౌఢకవిత్వం అనుకుంటాం
కానీ సాగతీతకు కూడా అదే సాక్ష్యమంటే వినరేం?
యతిమైత్రికి ముందు ఎప్పుడూ శత్రంతాలే ఎందుకంటే
శత్రువును చూసినట్టు అదిగో! అలా గుర్రుగా చూస్తారేం?
మూడోపాదం సగంలోనే వివక్షితభావం ముగిసిపోతే
మూడోకంటివాడికి తెలీకుండా పద్యాన్ని నడపరేం?
కనీసం మకుటాలతోనైనా మహారాజులై పోవచ్చునే!

భావం తనంత తాను నడవాలి
పద్యపాదం దానికి మనం చూపించే దారి
పదాలు తడబడవచ్చు నొక్కులు పడవచ్చు
భావం మాత్రం వాగులా సాగాలి ఒరవడితో
మలుపు తీసుకోవచ్చు మలిగిపోకూడదు
కలుపు చేరనీకూడదు కలవరపడకూడదు
దేవుణ్ణిలా భావాన్నీ ధ్యానించుదాం..తానే సాగుతుంది పద్యం

145

ఏ ఋతులక్షణాలైనా కల్తీ లేకుండానే
ఏ పూలపుప్పొడులైనా సహజవర్ణరుచులతోనే ...
మరి మనమే...కృత్రిమమేధతో సౌకర్యసంబరాలతో..
అది గెలిచినా ఓడినా బుద్ధితోనే పోరాడగలదు
రాని సంగీతంతో రాళ్ళను సైతం బండపరచగలదు
అసలే లేని భావాలతో ఆశ్వాసాంతపద్యాలూ రాయగలదు
మనస్సుతో పోటీపడితే మాత్రం దాని మనుగడే గల్లంతు

పప్పు పలచన అయితే పులుసుగా మార్చవచ్చు
బట్టలు వదులైతే మధ్యలో మరోకుట్టు వేయవచ్చు
మనస్సు పలచన అయి.. మరింతగా మేధ దిగజారి...
అరచేతిలో ప్రపంచమై....మిగతా శరీరం చచ్చుబడి.....
మన భావరాగాలు మనవి కాకుండా పోతుంటే?
మనిషి ప్రాకుడుజీవిగా మారిపోతుంటే.....
ఇప్పటికే పాతాళంలో ఉన్నాం.. ఇంకా ఎక్కడ దిగ-జారగలం?

146

ఒకే ఒక్క వేకువకల చాలు నాకు
మట్టివాసనలతో పుట్టిన మమతలను ఆవిష్కరిస్తూ
సాంకేతికతకూ ప్రాణంపోసి సహజసుమాలనే పలకరిస్తూ
పిల్లగాలుల అల్లరితో ముఖాల తెరలను తొలగిస్తూ
నీతులన్ని నీ కోసమే అని అర్థగళగీతాలు పాడకుండా
కాలంలోని మగతలో ఉన్న నిజాలను తట్టి లేపుతూ
నన్ను నేను యథార్థంగా అందరిలో చూచుకొనేలా...

అందమైన మబ్బుముక్కలలోని అనంతాకాశాన్నీ
వ్యష్టిలోని అందాల మాటునున్న సమష్టిసౌందర్యాన్నీ
ఎ దు గు తూ ఉన్న మానవునిలోని విశ్వజనీనతనూ
ప్రతిక్షణమూ ప్రతికణమూ చూడగలిగేలా
ప్రపంచమంతా పనితనమై మనస్సులన్నీ పసితనమై
వెలుగూ చీకటీ కలిసి వేకువకు ప్రాణంపోస్తూ
అలరిస్తూ ఆలపించిన వైతాళికశాంతిగీతంతో మేలుకొనేలా...

కవి పరిచయం

డా. సూరం శ్రీనివాసులు

జననం	:	03-06-1951, నెల్లూరు
తల్లిదండ్రులు	:	కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య
విద్యాభ్యాసం	:	20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే
ప్రాథమిక విద్య	:	1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం 4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట
ఉన్నత విద్య	:	6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్ 9 - ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల - 1967, మూలపేట
కళాశాల విద్య	:	సాహిత్య శిరోమణి, వేద సంస్కృత కళాశాల – 1971, మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమస్థానం)
ప్రైవేటుగా	:	పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. వాల్తేరు. పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాల్తేరు.
ఉద్యోగం	:	1971 - 1972, ఎస్.వి.ఎస్.ఒ.ఎస్. స్కూల్, చేకూరపాడు, ప్రకాశం జిల్లా.
లెక్చరర్	:	1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు & ఓరియంటల్ కాలేజీ, చిననింద్రకొలను. 1976 - 1980, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.
ప్రిన్సిపల్	:	1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ. 1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం
పార్ట్ టైమ్ లెక్చరర్	:	ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)
Visiting Fellow	:	రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)
Adjudicator	:	For Several Dessertations Submitted for Ph.D
కార్యదర్శి	:	హిందూధర్మ ప్రచార పరిషత్, తిరుపతి

పురస్కారాలు : – ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం బహుమతి – 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం

– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి–1981

– తెలుగు వెలుగులు – శ్రీనాథపీఠం–1987

– పుష్పకిరీట సన్మానం, చెన్నై

– ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల–2001

– బహుముఖ ప్రజ్ఞ పురస్కారం, సహజ సాహితి, చీరాల–2009

– పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్టప్రతిభాపురస్కారం – 2011

– సృజన సాహిత్య పురస్కారం, అద్దంకి–2013

– సి.పి.బ్రౌన్ సాహితీసేవాపురస్కారం, బెంగుళూరు – 2020 నవంబర్

– శ్రీమతి ఆసూరి మరింగంటి సులోచనా రంగాచార్య స్మారక పురస్కారం – సిరికోన ఉత్తమ కవితా పురస్కారం – 2021

– తెలుగు మరియు సంస్కృత అకాడమీ.. హంసపురస్కారం – 2023 సెప్టెంబరు

– శ్రీమాన్ కృష్ణమాచార్య కళాపీఠం వార్షిక పురస్కారం – 2023 సెప్టెంబరు

– శ్రీమతి రావిళ్ల మునెమ్మ స్మారక పురస్కారం – 2024 మే

– 1970 విద్యార్థి దశ నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Acharya Nagarjuna University.
2. Member, Academic Senate, Acharya Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Aharya Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Acharya Nagarjuna University.
5. Resource Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. మత్తవిలాసప్రహసనము – తెలుగు అనువాదం – 1974
2. సౌమనస్యము (ఖండకావ్యం – పద్యం) – 1979
3. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) – 1986
4. Hasya and Prahasana: A Critical Study (Ph.D..thesis) - 1989

5. పూజాకుసుమమ్. (రేడియో నాటకం.. సంస్కృతం) – 1985
6. కరావలంబమ్. (॥ ॥) – 1987
7. ధూర్తానుభవభాణః (సంస్కృతం)
8. గురువరరంజనభాణః (॥)
9. కవిజనమండనభాణః (॥)
10. నటసమాగమభాణః (॥)
11. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) – 2002
12. నికష (విశ్వధర్మవాణి మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన సంపాదకీయాల సంకలనం) – 2009
13. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
14. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) – 2019
15. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) – 2019
16. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య (సంస్కృతంలోనే – వ్యాకరణవిశేషప్రస్తావనతో) – 2020
17. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) – 2020
18. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ – తెలుగులో వ్యాఖ్య) – 2021
19. ధాతృప్రశ్నః అథవా వేదాన్తమణ్డనమ్ – 2021
20. స్థావరజంగమం (వచనకవితాగీత) – 2021
21. ఏటివాలు జ్ఞాపకం (వచనకవితాసంపుటి) – 2022
22. రసవిద్య (కవన శిల్ప సమీక్ష) – 2022
23. కాలగీత (వచనకవితాగీత) – 2023
24. విడుపుముడి (వచనకవితాగీత) – 2024
25. బిరుదోపనిషత్ (పద్యం) – 2025
26. ఆః...! (వచనకవితాగీత) – 2025
27. సంస్కృతభాణసాహిత్యము (విమర్శ) (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహూమతి1979)
28. భారతనిరుక్తి – నన్నయరుచిరార్థసూక్తి – 1983
29. భారతనిరుక్తి – తిక్కన సరసోక్తి
30. భారతనిరుక్తి – ఎఱ్ఱన ధర్మోక్తి
31. జనహిత వ్యాఖ్య (ఆంధ్రమహాభారతము – విరాటపర్వము) – 1989
32. జనహితవ్యాఖ్య (ఆంధ్రమహాభారతము – ఉద్యోగపర్వము) – 2000

33. జనహితవ్యాఖ్య (నిర్వచనోత్తరరామాయణము – తిక్కన) – 2005
34. వ్యాసమహాభారతం – తెలుగువచనం – 2010
 (వ్యాసభారతానికియథాతథానువాదం) 20 సంపుటాలు (6000 పుటలు)
35. మహాభారతము — తెలుగు (మూలం.. అనువాదం.. విశేషాంశాలు.. గీతాప్రెస్.. గోరఖ్ పూర్ ప్రచురణ) A4 సైజులో.. 7 సంపుటాలు.. 7250 పుటలు – 2018
36. శ్రీమహాభారతము(సంస్కృతం) విరాటపర్వము
 (జనహితవ్యాఖ్య – తెలుగులో – గీతాప్రెస్, గోరఖ్‌పూర్ ప్రచురణ) 2005

(27 – 36 గ్రంథాలకు సహరచయిత డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి)

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు –

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు – అసంపూర్ణ నవల – విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి : సులోచన

కుమార్తెలు : 1. మాధవి, BE (Hons) M.S
 అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్
 మనవడు : శ్రీహర్ష
 మనవరాలు : గాయత్రి
 2. డా॥ సుషమ., M.B.B.S., D.O
 అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్
 మనవరాలు : వాహిని

అభీష్ట విషయాలు : 1. అధ్యయనం, అధ్యాపనం
 2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన
 3. ఆచరణ ప్రాధాన్యం



Aah...!
Telugu Poetry
by Dr. Suram Srinivasulu

ఒక్కో కవిత మన గురించి మనం ఆలోచించుకునేట్టు చేస్తుంది. ఒక్కో కవిత మనని మనం తెలుసుకునేటట్టు చేస్తుంది. ఒక్కో కవిత మనలో ఉన్న మనకుతెలియని మనగురించి తెలియచేస్తుంది. ఒక్కో కవిత ఎవరికి వారికి తమ గురించే అందులో నేరుగా చెప్పారా అన్నట్టు సూటిగా ఉంటుంది.

– ఎన్.సిహెచ్.చక్రవర్తి

The 146 poems in Dr. Suram's 'Aaaah!' are a kaleidoscope of piercing reflections on human predicament in contemporary society.

- Adavikolanu Venkat

జయభాస్కర ప్రచురణలు

ISBN 978-9-35-469178-2

9 789354 691782 >

Price ₹150 /-